VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : సోమవారం 27.07.2026
సంపుటి : 09 సంచిక : 48 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com



కొమరవల్లి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఘన స్వాగతాల పలికిన బీజేపీ శ్రేణులు

- కొమరవల్లి పుణ్యక్షేత్రానికి విచ్చేసిన బండి సంజయ్
- కొమరవల్లి మల్లన్న స్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

# మోదీ పాలనలో భారతీయ రైల్వేల్లో నూతన శకం ఆరంభం

- దేశవ్యాప్తంగా రైల్వేల అభివృద్ధికి గత 12 ఏళ్లలో దాదాపు రూ.23 లక్షల బడ్జెట్ ను కేటాయించినం
- ఈ బడ్జెట్ లోనే తెలంగాణ రైల్వేలకు రూ.5,454 కోట్ల కేటాయింపు
- గతంతో పోలిస్తే 20 రెట్లు పెరిగిన రైల్వే బడ్జెట్
- గత 12 ఏళ్లలో తెలంగాణలో రైల్వేల కోసం రూ.36 వేల 286 కోట్లు ఖర్చు చేసినం
- మరో రూ.47 వేల 984 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి
- హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం కోసం 1 లక్షా 50 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయబోతున్నం
- తెలంగాణలో మరో 30 కొత్త రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే జరుగుతోంది
- వీటి నిర్మాణం కోసం 84 వేల 492 కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నం
- కాజీపేట యూనిట్‌లో భవిష్యత్తులో నూతన తరం ఇంటర్‌సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం
- రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునీకరణ
- తెలంగాణలో రూ.2 వేల కోట్ల వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నం
- రైలు పట్టాలు అభివృద్ధి బాటలు... ఉపాధి అవకాశాల పట్టాలు. భక్తి, పర్యాటక, ప్రగతి పట్టాలు
- కేంద్రంపై విమర్శలు మాని అభివృద్ధికి సహకరించండి
- ఫలించిన కొమరవెల్లి మల్లన్న భక్తుల నిరీక్షణ





## 'జై జవాన్‌జై కిసాన్‌జై యువ'.. కొత్త నినాదం ప్రతిపాదించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి



- యువతకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని సీఎం సూచన
- ఎమ్మెల్యే, ఎంపీ పోటీ వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని డిమాండ్

## యూపీలో ఎంఐఎం, ఎస్పీ పొత్తు



- యూపీలో బీజేపీని అడ్డుకోవడమే లక్ష్యమన్న ఎంఐఎం చీఫ్
- ఇప్పుడే చర్చలు జరపాలని అఖిలేష్‌కు బహిరంగ పిలుపు
- కలిసి పోటీ చేసేందుకు సిద్ధమని ఓవైసీ ప్రకటన
- ఇది ఓటు బ్యాంకు రాజకీయాలేనన్న బీజేపీ విమర్శ

## విద్యాశాఖ పథకాలపై ప్రహ్లాద్ జోషి తొలి సమీక్ష

- కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతల స్వీకరణ
- అమలు అవుతున్న పథకాలపై తొలి సమీక్ష
- ఉన్నతాధికారులతో విస్తృత సమావేశం

న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 26,

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో మాజీ



విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదివారం న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో కేంద్ర విద్యాశాఖ మంత్రిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

## సెమీకండక్టర్ మిషన్–2.0 లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- చిప్ డిజైన్, జీసీసీలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు

బెంగళూరు,వెలుతురు జులై 26:

భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)–2.0లో తెలంగాణాకు ప్రాధాన్యతని



వ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసాలపై హెచ్చరిక



- ఈఎండీ పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మొద్దన్న సజ్జనార్
- రూ.10 వేల డిపాజిట్ పేరుతో మోసాల అవకాశమని హెచ్చరిక
- నకిలీ లింకులు, యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఓటీపీ, యూపీఐ పిన్‌ను ఎవరితోనూ పంచుకోవద్దని విజ్ఞప్తి

## యువత ఆగ్రహమే గద్దె దింపుతుంది!

- విద్యార్థుల విజయాన్ని సొంతం చేసుకోవద్దు
- సీఎం తీరుపై తీవ్ర విమర్శలు
- హామీలపై ప్రశ్నల భయమేనని ఆరోపణ
- అందుకే విజయోత్సవ ఊరేగింపులని వ్యాఖ్య
- తెలంగాణ యువతను మోసం చేశారని విమర్శ



- హామీలు అమలు చేయకపోతే గట్టి మూల్యం తప్పదని హెచ్చరిక

## కొమురవెల్లికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- నేడు కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభం
- ముందుగా మల్లన్న స్వామి దర్శనం
- స్థానికులతో కలిసి కొమురవెల్లికి ప్రయాణం



## రాహుల్ ధర్నా క్రెడిట్ కోసమే: డీకే అరుణ



- నీట్ రద్దు వెంటనే ఎందుకు స్పందించ లేదని ప్రశ్న
- ఉద్యమానికి క్రెడిట్ కొట్టేయడానికే ధర్నా చేశారని ఆరోపణ
- దేశాన్ని అస్థిరపరిచే కుట్ర జరిగిందని వ్యాఖ్య
- ఉద్యమం వెనుక శక్తులన్నీ బయటపడతాయని వెల్లడి
- పేపర్ లీక్‌లపై కేటీఆర్, రేవంత్‌లపై విమర్శలు

## పాక్‌తో చర్చలంటే.. పీవోకేపైనే!

- పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర వ్యాఖ్యలు
- చొరబాట్లు, ఉగ్రవాదమే పాక్ విధానమని విమర్శ
- చర్చలు జరిగితే పీవోకే అంశంపై నేనని స్పష్టీకరణ
- ఆపరేషన్ సిందూర్‌తో గట్టి సమాధానం ఇచ్చామన్న మంత్రి



## ఉత్తర తెలంగాణకు గేమ్‌చేంజర్.. రూ.2,278.14 కోట్లతో ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- 2,009.23 ఎకరాల్లో ఎయిర్‌ఫీల్డ్, సివిల్ ఏవియేషన్, కార్గో, ఎంఆర్‌ఓ సదుపాయాల ఏర్పాటు
- ఉత్తర తెలంగాణలో పారిశ్రామిక, పర్యాటక, కార్గో, రక్షణ రంగాలకు భారీ ఊతం
- వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- 2026 డిసెంబర్ 31 నాటికి భూసేకరణ, మౌలిక వసతుల మార్పిడి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు



- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో మరో చారిత్రక అడుగు: ఆర్ అండ్ బి శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

# పాక్‌తో చర్చలంటే.. పీవోకేపైనే!

- కార్గిల్ విజయ్ దివస్‌లో అమరవీరులకు నివాళి

**కార్గిల్, వెలుతురు, జూలై 26,**

పాకిస్థాన్‌తో భారత్ ఎలాంటి చర్చలు జరిపినా అవి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) అంశంపైనే ఉంటాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పీవోకేను పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించుకుందని ఆరోపించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.భారత్ ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, అంతరిక్ష పరిశోధనల్లో ముందుకు దూసుకెళ్తుంటే.. పాకిస్థాన్ మాత్రం చొరబాట్లు, ఉగ్రవాద కార్యకలాపాలపైనే దృష్టి పెట్టిందని రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. భారత్ డేటా సెంటర్లను నిర్మిస్తుంటే.. పాక్ ఉగ్రవాద కేంద్రాలను అభివృద్ధి చేస్తోందని ఎద్దేవా చేశారు. ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ తన ప్రభుత్వ విధానంలో భాగంగా మార్చుకుందని ఆరోపించారు.ఉగ్రవాదుల ద్వారా భారత్‌ను బెదిరించాలని ప్రయత్నిస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచం చూసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉరి దాడి తర్వాత సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ కఠినంగా ప్రతిస్పందించిందని గుర్తుచేశారు. పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా భారత సైన్యం వారి ఊహకందని రీతిలో సమాధానం ఇస్తుందని హెచ్చరించారు.27వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, సైన్యాధికారులు కార్గిల్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# యూపీలో ఎంఐఎం, ఎస్పీ పొత్తు

- 2027 అసెంబ్లీ ఎన్నికలపై అప్పుడే వేడెక్కిన రాజకీయాలు

**లక్నో, వెలుతురు, జూలై 26,**

ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందే రాజకీయ సమీకరణాలు వేగం పుంజుకున్నాయి. సమాజ్‌వాదీ పార్టీతో పొత్తుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. బీజేపీ మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలంటే ఇప్పుడే చర్చలు ప్రారంభించాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌కు బహిరంగంగా పిలుపునిచ్చారు.మొరాదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఓవైసీ.. "మజ్లిస్‌కు బీజేపీ ప్రభుత్వం మళ్లీ రావడం ఇష్టం లేదు. పొత్తుకు సిద్ధంగా ఉన్నాం. ఎన్నికలు ముగిశాక బాధపడటం కంటే ఇప్పుడే మాట్లాడాలి" అన్నారు. తాను పోటీ చేస్తే సమాజ్‌వాదీ పార్టీ ఓట్లు చీలిపోతాయని అంటున్నారని, అవసరమైతే వారితో కలిసి పోటీ చేసేందుకూ సిద్ధమేనని చెప్పారు.తమ పోరాటం ఏ మతానికి వ్యతిరేకంగా కాదని, గౌరవం, న్యాయం, సమాన హక్కుల కోసమేనని ఓవైసీ స్పష్టం చేశారు. అఖిలేష్ యాదవ్‌తో కూర్చొని హక్కులు, న్యాయం గురించి చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.ఓవైసీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. ఇది పూర్తిగా ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా ఆరోపించారు. అఖిలేష్ యాదవ్, ఓవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో పోటీ పడుతున్నారని, ఇప్పుడు ఆ పోటీని పక్కనబెట్టి కలిసి పనిచేయాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. 2027లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# రాహుల్ ధర్నా క్రెడిట్ కోసమే: డీకే అరుణ

- గ్రూప్-1, పదో తరగతి లీక్‌లను ప్రస్తావించిన బీజేపీ ఎంపీ

**హైదరాబాద్, వెలుతురు, జూలై 26,**

నీట్ పరీక్ష రద్దు చేసిన వెంటనే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎందుకు ధర్నా చేయలేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. ఇతరులు చేపట్టిన ఉద్యమానికి క్రెడిట్ దక్కించుకోవడానికే ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముందు ధర్నా చేశారని ఆరోపించారు. ఉద్యమం వెనుక ఉన్న శక్తులన్నీ త్వరలోనే బయటపడతాయని అన్నారు.దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులను భారతీయులు ఎప్పటికీ సహించరని డీకే అరుణ పేర్కొన్నారు. కొందరు దేశాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర చేశారని, నేపాల్, బంగ్లాదేశ్‌ల మాదిరిగా భారత్‌ను మార్చాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఉద్యమాన్ని నడిపింది ఎవరు? దాని వెనుక ఏ అరాచక శక్తులు ఉన్నాయన్నది విచారణలో తేలుతుందని చెప్పారు.పేపర్ లీక్ అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాట్లాడే నైతిక హక్కు లేదని డీకే అరుణ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రం లీక్ అయినప్పుడు ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వంలో పదో తరగతి ప్రశ్నాపత్రం లీక్ అయినా బాధ్యత వహించి ఎవరు రాజీనామా చేశారని నిలదీశారు. దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలకు పాల్పడిన వారందరికీ సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# విద్యాశాఖ పథకాలపై ప్రహ్లాద్ జోషి



**(మొదటి పేజీ తరువాయి)**

బాధ్యతలు చేపట్టిన వెంటనే మంత్రిత్వశాఖ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించి, వివిధ పథకాలు, విద్యా కార్యక్రమాల అమలుపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.ఈ సమావేశంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి కూడా పాల్గొన్నారు. విద్యాశాఖకు చెందిన రెండు విభాగాల కార్యదర్శులు, ఇతర సీనియర్ అధికారులు సమావేశానికి హాజరై, ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలు, సంస్కరణలు, భవిష్యత్ కార్యాచరణపై మంత్రికి వివరించారు.ఇప్పటికే వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహిస్తున్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను అదనపు బాధ్యతగా కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. విద్యా రంగంలో కొనసాగుతున్న కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయడంతో పాటు, సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన గతంలో వెల్లడించారు.

# కొమురవెల్లికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి





**హైదరాబాద్, వెలుతురు, జూలై 26,**

కొమురవెల్లిలో నూతన రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి బయలుదేరారు. వివిధ వర్గాల ప్రజాప్రతినిధులు, స్థానికులతో కలిసి కొమురవెల్లికి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.కొత్త రైల్వే స్టేషన్‌ను ప్రారంభించే ముందు కొమురవెల్లి శ్రీ మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ప్రారంభం వల్ల భక్తులతో పాటు స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

# మోదీ పాలనలో భారతీయ రైల్వేల్లో నూతన శకం ఆరంభం

- రూ.6 కోట్ల వ్యయంతో రైల్వే స్టేషన్ నిర్మాణంతో ఆధ్యాత్మిక అనుభుతి
- రైల్వే స్టేషన్ తో కొమరవెల్లి ప్రాంత అభివృద్ధి
- కొమరవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్

**కొమరవెల్లి వెలుతురు జూలై 26:**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో రైల్వే రంగంలో నూతన శకం ఆరంభమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా రైల్వే రంగ అభివృద్ధికి దాదాపు రూ.23 లక్షల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. తెలంగాణలో మునుపెన్నడూ లేనివిధంగా రైల్వే లేన్ల నిర్మాణం, నూతన రైళ్లు, స్టేషన్ల ఆధునీకరణ పేరిట రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.36 వేల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసిన కేంద్రం మరో రూ.84 వేల 492 కోట్ల అంచనా మరో 30 రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణకు 3 బుల్లెట్ రైళ్లు రాబోతున్నాయని, అందుకోసం రూ.1.5 లక్షల కోట్లతో హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో తెలంగాణకు రూ.13 లక్షల 9 వేల కోట్లు కేటాయించామని, కేవలం ఓఆర్ఆర్ సహా జాతీయ రహదారుల నిర్మాణం కోసమే రూ.1.74 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం రోజున సిద్దిపేట జిల్లా కొమరవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో బండి సంజయ్ హాజరై ప్రసంగించారు. ఏమన్నారంటే.లక్షలాది మంది కొమరవెల్లి మల్లన్న స్వామి భక్తుల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు ఫలితం లభించింది. తెలంగాణలో ఇయాళ నూతన కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ను ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్ నిర్మించినం.. ఈ స్టేషన్ ప్రవేశ ద్వారం ఆలయ శైలిలో రూపకల్పన చేయడంవల్ల ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.ఈ రోజు నుంచి కొమురవెల్లికి వచ్చే ప్రతి భక్తుడి ప్రయాణం మరింత సులభం, మరింత సౌకర్యవంతం కాబోతుంది. "దేవుడి దగ్గరకు వెళ్లే దారి సులభమైతే... భక్తి మరింత పెరుగుతుంది." అనే సామెత ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇకపై రైలు దిగగానే "మల్లన్న దగ్గరికి వచ్చేశాం" అనే ఆత్మీయ అనుభూతి కలుగుతుంది. రైలు ఎక్కడికి వెళ్తే... అక్కడ అభివృద్ధి జరుగుతుంది. ఈ రైల్వే స్టేషన్ ప్రారంభంతో భక్తులకే కాదు కొమరవెల్లి ప్రాంత రైతులకు, చిన్న వ్యాపారులకు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అధ్యాత్మిక పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. ప్రత్యేకించి శివరాత్రి, జాతరల సమయంలో లక్షలాది మంది భక్తులకు ఈ రైల్వే సేవలు ఎంతో ఉపయోగపడతాయి. ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా బాగుపడాలంటే రవాణా సౌకర్యాలు బాగుంటేనే సాధ్యమవుతుంది. అందుకే ప్రధాని మోదీ రోడ్డు, రైల్వే, ఎయిర్ కనెక్టివిటీలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. అందులో భాగంగా గత 12 ఏళ్లలో ట్రిపుల్ ఆర్(రీజనల్ రింగ్ రోడ్) తోసహా తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి 1 లక్షా 74 వేల 412 కోట్లు ఖర్చు చేస్తున్నం. రాష్ట్రంలో పౌర విమనయాన రంగ అభివృద్ధికి దాదాపు 1073 కోట్ల రూపాయలు కేటాయించినం. మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారతీయ రైల్వేల్లో నూతన శకం ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రైల్వేలను అభివృద్ధి చేస్తున్నారు. దేశవ్యాప్తంగా రైల్వేల అభివృద్ధి కోసం గత 12 ఏళ్లలో దాదాపు 23 లక్షల రూపాయల బడ్జెట్ ను కేటాయించారు.మన తెలంగాణ విషయానికొస్తే....గతంలో యూపీఏ హయాంలో 2014న రూ.258 కోట్లు మాత్రమే కేటాయించారు. మోదీగారొచ్చాక బడ్జెట్ ను 20 రెట్లు అధికంగా పెరిగింది. ఈ ఏడాది తెలంగాణకు రూ.5,454 కోట్లు కేటాయించినం. గత 12 ఏళ్లలో తెలంగాణలో రైల్వేల కోసం 36 వేల 286 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. మరో 47 వేల 984 కోట్ల రూపాయల విలువైన రైల్వే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా 7 బుల్లెట్ రైళ్లను మంజూరు చేస్తే...మోదీగారు తెలంగాణకు మూడు కేటాయించారు. 1.హైదరాబాద్ – బెంగళూర్, 2.హైదరాబాద్ – చెన్నై 3. హైదరాబాద్–పూణె హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం కోసం 1 లక్షా 50 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయబోతున్నరు. వీటితోపాటు ఎంఎంటీసీ ఫేజ్ 2, ఔటర్ రింగ్ రైల్ ప్రాజెక్టుతోసహా మరో 30 కొత్త రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే జరుపుకుంటున్నయ్. వీటి నిర్మాణం కోసం 84 వేల 492 కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నం. హైదరాబాద్‌లోని ఎంఎంటిఎస్‌ను యాదాద్రి వరకు విస్తరించబోతున్నం. అందుకోసం 1122 కోట్ల రూపాయలను ఖర్చు చేయబోతున్నం. దాదాపు 715 కోట్ల రూపాయలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, 322 కోట్ల రూపాయలతో నాంపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలోనే వీటిని పున:ప్రారంభించుకోబోతున్నం. ఇప్పటికే 430 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ఎయిర్ పోర్టును తలపిస్తోంది. గత 12 సంవత్సరాల్లో రాష్ట్రంలో 340 కి.మీ. కొత్త రైల్వే మార్గాలు, 576 కి.మీ. డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రుప్లింగ్, బైపాస్ లైన్లు, 2,034 ట్రాక్ కి.మీ. విద్యుదీకరణ పూర్తి చేసినం. అట్లాగే మనోహరాబాద్–కొత్తపల్లి (సిద్దిపేట–కొత్తపల్లి) కొత్త రైల్వే మార్గం, కాజీపేట–విజయవాడ ట్రిప్లింగ్, ముద్‌ఖేడ్–మెద్చల్ డబ్లింగ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ 12 ఏళ్లలో 627 కి.మీ. మార్గంలో 63 స్టేషన్లకు కవచ్ 3.2 అమలు చేసినం. అన్‌మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్‌లను పూర్తిగా తొలగించాం. 329 రోడ్డు అండర్ బ్రిడ్జిలు (RUBలు), 59 రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (ROBలు), 58 ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేసినం. 21 ప్రాంతాల్లో 346 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినం. రాష్ట్రంలోని అన్ని రైల్వే స్టేషన్లలో హైస్పీడ్ వై–ఫై సౌకర్యం కల్పించడంతోపాటు ప్రయాణీకుల కోసం 73 స్టేషన్లలో వన్ స్టేషన్ – వన్ ప్రొడక్ట్ స్టాళ్లను ఏర్పాటు చేసినం. 521 కోట్ల రూపాయల వ్యయంతో కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ యూనిట్‌లో భవిష్యత్తులో నూతన తరం ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ ప్రతిపాదనలు ఉన్నాయి. మోదీగారి దూరదృష్టితో ప్రారంభమైన అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నారు. తెలంగాణలో రూ.2,000 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి చేస్తున్న 40 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నం. ఇటీవల బేగంపేట, వరంగల్ హైటెక్ సిటీ స్టేషన్లను గౌరవ ప్రధానమంత్రి గారు ప్రారంభించారు. అంతకుముందు దాదాపు 25 కోట్ల 85 లక్షల రూపాయలతో కరీంనగర్ రైల్వే స్టేషన్ ను ఆధునీకరించినం. రైల్వే ట్రాక్‌లు కేవలం రెండు పట్టాలు కావు...అభివృద్ధి బాటలు... ఉపాధి అవకాశాల పట్టాలు. భక్తిని, పర్యాటకాన్ని, ప్రగతిని కలిపే పట్టాలు. ఈ రోజు ప్రారంభమైన కొమురవెల్లి రైల్వే స్టేషన్ భవిష్యత్తులో అభివృద్ధికి చిరునామాగా నిలవాలని, మల్లన్న స్వామి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటున్నాను. మోదీ 12 ఏళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధికి దాదాపు రూ.14లక్షల కోట్లు కేటాయించారు. ఇకనైనా విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు మ్యాచింగ్ గ్రాంట్లు ఇచ్చి కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకోవాలి.

# ‘జై జవాన్‌జై కిసాన్‌జై యువ’.. కొత్త నినాదం ప్రతిపాదించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి

- రాజ్యసభ, శాసనమండలి పోటీ వయస్సు 30 నుంచి 25 ఏళ్లకు చేయాలన్న ప్రతిపాదన
- ఆగస్టులో తెలంగాణ శాసనసభ, మండలి సంయుక్త సమావేశం నిర్వహణ
- తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపనున్నట్లు వెల్లడి
- పరీక్షల నిర్వహణలో లోపాలపై కేంద్రానికి సూచనలు చేసిన సీఎం

**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**

దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్రను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో "జై జవాన్–జై కిసాన్–జై యువ" అనే కొత్త నినాదాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.హైదరాబాద్‌లో జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో యువత నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపిస్తోందని, అదే అవకాశాలు రాజకీయ వ్యవస్థలోనూ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం 21 ఏళ్ల వయస్సులోనే యువత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వర్తిస్తోందని, ప్రపంచస్థాయి సంస్థలకు నాయకత్వం వహిస్తోందని గుర్తు చేశారు.61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ వయస్సును 21 ఏళ్లకు నిర్ణయించిన విషయాన్ని ప్రస్తావించిన సీఎం, అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల పోటీ వయస్సును 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల పోటీ వయస్సును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు.ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు సేకరించేందుకు ఆగస్టులో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అధికారిక తీర్మానం ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు.అదే సమయంలో డీలిమిటేషన్, పార్లమెంట్ స్థానాల పెంపు, మహిళా రిజర్వేషన్ వంటి కీలక అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపును కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.

అలాగే సీబీఎస్ఈ, నీట్, నెట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆందోళన వ్యక్తం చేసిన సీఎం, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# యువత ఆగ్రహమే గద్దె దింపుతుంది!

**హైదరాబాద్, వెలుతురు, జూలై 26,**

విద్యార్థుల కృషితో సాధించిన విజయాలను ప్రభుత్వం తన రాజకీయ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే ప్రభుత్వం విజయోత్సవ ఊరేగింపులు నిర్వహిస్తోందని ఆరోపించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే ప్రయత్నమే ఈ కార్యక్రమాల వెనుక ఉందని వ్యాఖ్యానించారు.తెలంగాణ యువతకు ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, ఇతర సంక్షేమ హామీలు సహా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. <

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాల్సిన ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలకు, విజయోత్సవాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు.విద్యార్థులు, నిరుద్యోగులు ఇప్పటికీ ప్రభుత్వ నిర్ణయాల కోసం ఎదురుచూస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల విజయాలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.ఇప్పటికైనా తెలంగాణ యువతకు ఇచ్చిన ప్రతి హామీని కాలపరిమితిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే యువతలో పెరుగుతున్న అసంతృప్తి ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందని, ప్రజాస్వామ్యబద్ధంగా తెలంగాణ యువతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసాలపై హెచ్చరిక

- మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచన

**హైదరాబాద్, వెలుతురు, జూలై 26,**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ముందస్తు డిపాజిట్ (ఈఎండీ) ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాజీ సీపీ, సైబర్ భద్రత అవగాహన కార్యక్రమాల అధిపతి సజ్జనార్ ప్రజలను హెచ్చరించారు. రూ.10 వేల ఈఎండీ చెల్లిస్తే ఇల్లు మంజూరు చేస్తామని, ప్రభుత్వం తరపున మాట్లాడుతున్నామని చెప్పే ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని సూచించారు. "ఈ రోజే చివరి తేదీ", "ఇప్పుడే చెల్లించకపోతే అవకాశం కోల్పోతారు" అంటూ భయపెట్టి డబ్బులు వసూలు చేసే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు డబ్బులు దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సజ్జనార్ అన్నారు.

వాట్సాప్‌లో వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయొద్దని సూచించారు. ప్రభుత్వ పోర్టళ్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు రూపొందించి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.ఎనీ డెస్క్, టీమ్ వ్యూయర్ వంటి రిమోట్ యాక్సెస్ యాప్‌లను అపరిచితుల సూచన మేరకు ఇన్‌స్టాల్ చేయరాదని సూచించారు. రీఫండ్ పేరుతో ఎవరూ యూపీఐ పిన్, ఓటీపీ, బ్యాంకు వివరాలు అడగరని స్పష్టం చేశారు. ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పిస్తాం





- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు – దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**హైదరాబాద్, వెలుతురు జూలై 26:**

రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు కో–ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమం, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ ప్రకటించారు.ఆదివారం జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన నియోఫ్లై బోల్ట్ యాక్సెసిబిలిటీ డివైజ్‌ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెన్నెముక గాయ (Spinal Cord Injury) దివ్యాంగులు, ఇతర తీవ్ర వైకల్యం కలిగిన 90 మంది లబ్ధిదారులకు అత్యాధునిక సాంకేతికత రూపొందించిన ఈ మొబిలిటీ పరికరాలను అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమంలో భాగంగా HYUNDAY MOBIS సంస్థ ఆర్థిక సహకారంతో సుమారు ₹1.26 కోట్ల వ్యయంతో, ఒక్కోటి సుమారు ₹1.40 లక్షల విలువైన నియోఫ్లై బోల్ట్ పరికరాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లురి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్య సాధన కమిటీ విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఇటీవల ట్రాన్స్‌జెండర్లకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం మాదిరిగానే, దివ్యాంగులకు కూడా కో–ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని తాను ప్రతిపాదించానని తెలిపారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.మైనారిటీలకు ఉన్న విధంగానే దివ్యాంగులకు కూడా స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.దివ్యాంగుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న మంత్రి, ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ పెంపు, సంక్షేమ పథకాల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను మరింత బలోపేతం చేసేందుకు సమర్థులైన అధికారులను నియమిస్తూ సేవలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు.తీవ్ర వైకల్యం గల దివ్యాంగుల సంక్షేమంతో పాటు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్న SCIAT అధ్యక్షుడు షఫీ అహ్మద్ ఖాన్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ... దివ్యాంగుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రభుత్వం ద్వారా సాధ్యమైన అన్ని విధాలుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో HYUN-DAY MOBIS డైరెక్టర్, CSR ప్రతినిధులు, స్కైట్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి షఫీ NPRD జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, CSR ప్రతినిధి జయశ్రీ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి. ప్రభంజనరావు, NeoFly Motion Solutions ప్రతినిధులు స్వస్తిక్, తరుణ్ చిన్న శ్రీశైలం యాదవ్, స్థానిక కార్పొరేటర్లు, దివ్యాంగ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' వీక్షణం & 26వ రోజుకు చేరిన ఓటరు సేవ మహాయజ్ఞం

- **పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్కా బాల్‌రెడ్డి**

**వెలుతురు ఉప్పర్‌పల్లి / హైదర్‌గూడ జూలై 26:**

ఆదివారం రోజున ఉప్పర్‌పల్లిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద గౌరవనీయ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 136వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఫోన్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించడం/ఆలకించడం జరిగింది. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ గారు పంచుకున్న సందేశం స్థానిక సేవా సైనికులలో, ప్రజలలో ఎంతో నూతనోత్సాహాన్ని నింపింది.

ప్రధాని గారి మాటలు దేశభక్తిని, సేవాభావాన్ని మరింత పెంపొందించాయని, ప్రజలందరూ 'మన్ కీ బాత్' శ్రద్ధగా ఆలకించి దేశం పట్ల గౌరవాన్ని పెంచుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.





**26వ రోజుకు చేరిన ఓటరు సేవ ప్రక్రియ:**

గత 26 రోజులుగా ఉప్పర్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద నిరంతరాయంగా జరుగుతున్న ఓటరు సహాయక ప్రక్రియలో భాగంగా, ఆదివారం రోజున ఎస్.ఐ.ఆర్ (SIR) ఓటరు ఫారాలు (ఓటరు నమోదు, చేర్పులు మరియు సవరణ ఫారాలు) పూరించి ఇవ్వడం జరిగింది. ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం మరియు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని స్పష్టం చేశారు.

పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొక్కా బాల్‌రెడ్డి, గోనే శ్రీకాంత్ రెడ్డి, భూపాల్,కరుణాకర్, రాజశేఖర్, నవీన్ మరియు పార్టీ సేవా సైనికులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.

# ప్రజా భవన్‌లో నిర్వహించిన ఆషాడ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు





- **డప్పు చప్పుళ్లు, పోతురాజుల వీరనృత్యాలు, శివసత్తుల పూనకాల నడుమ అమ్మవారికి బోనం సమర్పించిన మంత్రి**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించిన మంత్రి సురేఖ**

**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**

అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు ఆదివారం ప్రజా భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి నివాసంలో నిర్వహించిన ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా డప్పు చప్పుళ్లు, పోతురాజుల వీరనృత్యాలు, శివసత్తుల పూనకాల నడుమ మంత్రి కొండా సురేఖ గారు భక్తిశ్రద్ధలతో బోనమెత్తి ప్రగతి భవన్ లో కొలువైన అమ్మవారికి సమర్పించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామదేవతల పట్ల ప్రజలకున్న అపార భక్తి, విశ్వాసానికి బోనాల పండుగ నిదర్శనమని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న బోనాల సంప్రదాయం సమాజంలో ఐక్యతను, పరస్పర సహకారాన్ని, సాంస్కృతిక విలువలను బలోపేతం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఆషాడ బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, వైభవంగా జరుగుతున్నాయని, ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, దేవాలయాల కమిటీలు, భక్తులకు మంత్రి అభినందనలు తెలిపారు.

# కొమరవల్లి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కు ఘన స్వాగతాల పలికిన బీజేపీ శ్రేణులు

- **కొమరవెల్లి పుణ్యక్షేత్రానికి విచ్చేసిన బండి సంజయ్**
- **కొమరవెల్లి మల్లన్న స్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి**

**కొమరవల్లి వెలుతురు జూలై 26:**




# రోడ్డు దుస్థితిపై బీఆర్ఎస్ భారీ నిరసన

**లక్ష్మారెడ్డిగూడెం గేట్ వద్ద ధర్నా.. వెంటనే రహదారి పూర్తి చేయాలని డిమాండ్**

**శంకర్‌పల్లి, వెలుతురు జులై 26 :**

శంకర్‌పల్లి–మైతాప్‌ఖాన్‌గూడా ప్రధాన రహదారి దుస్థితిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం లక్ష్మారెడ్డిగూడెం గేట్ వద్ద భారీ ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. రహదారిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రధాన రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలను అనుసంధానించే కీలక మార్గమైన శంకర్‌పల్లి రోడ్ నుంచి మైతాప్‌ఖాన్‌గూడా క్రాస్‌రోడ్డు వరకు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని అన్నారు.ఈ మార్గం నుంచి నవాబ్‌పేట–వికారాబాద్, వెంకటల–మోమిన్‌పేట–మర్పల్లి, గొల్లపల్లి–మల్కాపూర్ చౌరస్తా–సంగారెడ్డి ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు ప్రతిరోజూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారని తెలిపారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు, అత్యవసర వైద్య సేవలకు అంబులెన్సులు ఆలస్యమవుతున్నాయని, వాహనాలు తరచూ చెడిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఇంతటి సమస్య ఉన్నప్పటికీ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కళ్లు తెరిచి ఈ రహదారి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ శంకర్‌పల్లి మండల, మున్సిపల్ నాయకులతో పాటు లక్ష్మారెడ్డిగూడెం, మహాలింగాపురం గ్రామాల ప్రజలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి, చిన్న నరసింహులు, సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, భుజంగ రెడ్డి, గంద్రు మాణిక్య రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, నారాయణ, మాజీ ఎంపీటీసీ యాదగిరి, సీనియర్ నాయకులు కొంగర మల్లేశం, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, అశోక్ గౌడ్, దండు నర్సింహులు, విట్టల్ రెడ్డి, రామశేఖర్ రెడ్డి, అనంత్ రెడ్డి, బోడ వెంకటయ్య, కుమార్, కరుణాకర్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకటయ్య, బుచ్చిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# ఆరుట్ల గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ సవరణ ప్రక్రియను బూత్ లెవెల్ ఏజెంట్లతో కలిసి పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

- **అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు తొలిగిపోకుండా ప్రతి కాంగ్రెస్ నాయకుడు కార్యకర్త కృషిచేయాలి ఓటర్ నమోదు చేయించాలి**
- **కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్, ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలం**

**మంచాల వెలుతురు జూలై 26:**

మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి ఆదేశాల మేరకు ఆరుట్ల గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ ప్ర ధానకార్యదర్శి చిందం శ్రీశైలంఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ ద గ్గరుండి ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమాన్ని బూత్ లెవెల్ ఏజెంట్లతో కలిసి ప్రతి ఇంటికి వె ళ్లి ఎస్ఐఆర్ ఓటర్ సవరణ ఫారలు సమర్పించని వారిని గుర్తించి స్వయంగా పారాల నునింపి బిఎల్ ఓ అధికారులకు సమర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసందర్భంగా రాష్ట్ర నాయకు డు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు కాంగ్రెస్ పార్టీ నా యకులు ప్రతి గడపగడపకువెళ్లి ఇప్పటివరకు ఓటర్ సవరణ పత్రాలు సమర్పించని వారి అర్హు లైన వారిని గుర్తించి ఓట్లు తొలిగిపోకుండా ప్రతి కాంగ్రెస్ నాయకుడు కార్యకర్త కృషిచేయాలి అ న్నారుప్రతి ఓటు మనకు ఒక ఆయుధం అని అన్నారు బూత్ లెవెల్ ఏజెంట్లకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరివ లైష్ మంచాల సొసైటీ డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు అ నంగళ్ళ జగన్నాథం ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ బుట్టి కృష్ణ ముదిరాజ్






బూత్ లెవెల్ ఏజెంట్లు చిందం ఐలయ్య నుకం మల్లేష్ ముదిరాజ్ పంబాల కిషోర్ దాసరమోని అశోక్ ముదిరాజ్ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ పల్లె రాములుగౌడ్ కావాలి శ్రీని వాస్ ముదిరాజ్ దాసరమోని రమేష్ ముదిరాజ్ బుట్టి జంగయ్య ముదిరాజ్ మానిపాటి వెంకటే ష్ మారసురేష్ తలారి కృష్ణ ముదిరాజ్ వస్పరి కుమార్ మైనార్టీ నాయకుడు మహమ్మద్ అష్రఫ్ ఆడెపు మధు పంబాల శివ ఓరిగంటి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరంగ శాంతి... సామాజిక బాధ్యత!

మనిషి జీవితం ఒక నిరంతర ప్రయాణం. ఈ ప్రయాణంలో అతడు ఎదుర్కొనే ప్రతి మలుపులోనూ రెండు ముఖ్యమైన అంశాలు అతని దారిని నిర్దేశిస్తాయి అవే ఆధ్యాత్మికత మరియు బాధ్యత. ఇవి రెండూ వేర్వేరు దారులుగా కనిపించినా, వాస్తవానికి ఒకే నాణేనికి రెండు వైపులు వంటివి. ఆధ్యాత్మికత మనిషికి అంతరంగిక శాంతిని, జీవన లక్ష్యాన్ని అందిస్తే, బాధ్యత అతడిని సమాజంతో, కుటుంబంతో, ప్రకృతితో అనుసంధానం చేస్తుంది. ఈ రెండింటి సమతుల్యతే నిజమైన మానవ జీవన సార్థకతకు మూలం.ఒక మనిషి తన దైనందిన జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడులు, సవాళ్లు, ఆందోళనలను తట్టుకుని నిలబడటానికి ఆధ్యాత్మిక చైతన్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే, ఆ వ్యక్తి సమాజంలో ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా నిలబడటానికి బాధ్యతా రాహిత్యాన్ని వీడడం అత్యంత ఆవశ్యకం.ఆధ్యాత్మికత అనగానే చాలామందికి గుడులు, పూజలు, తీర్థయాత్రలు గుర్తుకు వస్తాయి. కానీ నిజమైన ఆధ్యాత్మికత అంతకంటే లోతైనది. అది మనిషి తన అంతరాత్మతో జరిపే సంభాషణ. తాను ఎవరు, తన జీవిత లక్ష్యం ఏమిటి, ఈ ప్రపంచంతో తనకున్న సంబంధం ఏమిటి అనే ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నమే ఆధ్యాత్మికత. ఇది ఏ ఒక్క మతానికో, ఆచారానికో పరిమితం కాదు. ధ్యానం చేసినా, ప్రకృతిని ఆస్వాదించినా, ఇతరుల పట్ల కరుణ చూపినా, నిశ్శబ్దంగా కూర్చొని తనను తాను పరిశీలించుకున్నా ఇవన్నీ ఆధ్యాత్మిక అనుభవాలే.మన పురాతన గ్రంథాలైన భగవద్గీత, ఉపనిషత్తులు కూడా ఆధ్యాత్మికతను కేవలం పూజా విధానంగా కాక, జీవన విధానంగా చూపించాయి. భగవద్గీతలో స్పష్టంగా చెప్పినట్లుగా "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన"(అంటే: కర్మలు చేయడం వరకే నీ అధికారం, ఫలితాలపై ఆశ ఉండకూడదు.)ఈ వాక్యం మనకు చెప్పేది ఏమిటంటే నిష్కామ కర్మ ద్వారానే నిజమైన ఆధ్యాత్మిక ఔన్నత్యం సాధ్యమవుతుందని. కర్మను వీడి పారిపోవడం ఆధ్యాత్మికత కాదు, కర్మను ఫలితంపై ఆశ లేకుండా చేయడమే అసలైన యోగం.బాధ్యత అనేది మనిషి సమాజంలో జీవించడానికి కావలసిన ఒక అనివార్యమైన లక్షణం. ఇది కుటుంబం పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల, ప్రకృతి పట్ల మనిషికి ఉండవలసిన కర్తవ్య నిర్వహణ. ఒక తండ్రి తన పిల్లలను పోషించడం, ఒక ఉద్యోగి తన పనిని నిజాయితీగా చేయడం, ఒక పౌరుడు తన దేశ చట్టాలను గౌరవించడం



ఇవన్నీ బాధ్యతలే. బాధ్యత లేకుండా ఏ సమాజం అభివృద్ధి చెందలేదు. బాధ్యతారహితమైన స్వేచ్ఛ అరాచకానికి దారితీస్తుంది.మానవ జీవితంలో బాధ్యత అనేది వివిధ రూపాల్లో విస్తరించి ఉంటుంది. కుటుంబ బాధ్యత ద్వారా ఇంటిలోని పిల్లలు, తల్లిదండ్రుల పట్ల ప్రేమ, సంరక్షణ మరియు ఆప్యాయతలను అందించడం మొదటి కర్తవ్యం. అలాగే సమాజంలో పొరుగువారితో సహకారం, సద్భావనలతో మసలుకోవడం సామాజిక బాధ్యత కిందకు వస్తుంది. దేశం మరియు చట్టాలను గౌరవిస్తూ నిబంధనలను పాటించడం, దేశభక్తిని ప్రదర్శించడం జాతీయ బాధ్యత కాగా, మనం జీవిస్తున్న ప్రకృతిని, జంతుజాలాన్ని కాపాడుకుంటూ కాలుష్య నివారణకు కృషి చేయడం పర్యావరణ బాధ్యతగా నిలుస్తుంది. ఈ అన్ని రకాల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే వ్యక్తిగత జీవితంతో పాటు సమాజం కూడా ప్రశాంతంగా, సుభిక్షంగా సాగుతుంది.అందుకే మన పెద్దలు ఎప్పుడూ ధర్మం అనే పదాన్ని బాధ్యతతో ముడిపెట్టి చెప్పేవారు. ధర్మం అంటే కేవలం మతపరమైన ఆచారం కాదు, అది మనిషి తన స్థానంలో నిర్వర్తించవలసిన కర్తవ్యం.చాలామంది ఆధ్యాత్మికతను, బాధ్యతను వేర్వేరుగా చూస్తారు. కొందరు ఆధ్యాత్మికత అంటే లౌకిక జీవితం నుండి పారిపోవడం అని భావిస్తారు. కానీ ఇది తప్పుడు అవగాహన. నిజమైన ఆధ్యాత్మికత ఎప్పుడూ బాధ్యత నుండి తప్పించుకోమని చెప్పదు, బదులుగా ఆ బాధ్యతలను మరింత శ్రద్ధగా, నిస్వార్థంగా నిర్వహించమని ప్రేరేపిస్తుంది.గాంధీజీ జీవితమే దీనికి గొప్ప ఉదాహరణ. ఆయన ఆధ్యాత్మిక సాధకుడిగా జీవించినా, దేశ స్వాతంత్ర్య పోరాటంలో తన బాధ్యతను విస్మరించలేదు. ఆయనకు ఆధ్యాత్మికత అంటే ఏకాంతంలో ధ్యానం చేయడం మాత్రమే కాదు, ప్రజల సేవలో దైవాన్ని దర్శించడం. సేవే పరమ ధర్మం అనే సూత్రాన్ని ఆయన తన జీవితం ద్వారా నిరూపించారు.అదేవిధంగా, స్వామి వివేకానంద కూడా ఇట్లే బోధించారు.నిద్రలో ఉన్న దేవుడిని పూజించే బదులు, ఆకలితో ఉన్న మనిషిలో దేవుడిని చూడండి.మానవ సేవే మాధవ సేవ.ఇది ఆధ్యాత్మికత మరియు బాధ్యత ఎంతగా పెనవేసుకున్నాయో స్పష్టం చేస్తుంది. ఒక వ్యక్తి ఎంత ధ్యానం చేసినా, ఎన్ని పూజలు చేసినా, తన కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యత మరిస్తే ఆ ఆధ్యాత్మికత అసంపూర్ణమే.నేటి ఆధునిక సమాజంలో మనిషి ఆధ్యాత్మికతను, బాధ్యతను రెండింటినీ కోల్పోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు భౌతిక సుఖాల వెంట పరుగెత్తుతూ, మరోవైపు తన కర్తవ్యాలను విస్మరిస్తూ మనిషి మానసిక అశాంతికి గురవుతున్నాడు. కుటుంబ సంబంధాలు బలహీనపడుతున్నాయి, పర్యావరణం పట్ల నిర్లక్ష్యం పెరుగుతోంది, సమాజంలో స్వార్థం ప్రబలుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆధ్యాత్మికత మరియు బాధ్యతల సమతుల్యత మరింత ఆవశ్యకమైంది.విద్యార్థి తన చదువును శ్రద్ధగా చేయడం ఆధ్యాత్మిక చైతన్యం నుండి పుట్టిన బాధ్యతే.వైద్యుడు తన రోగుల పట్ల కరుణతో వ్యవహరించడం నిజమైన ధర్మం.ప్రభుత్వ అధికారి ప్రజల సేవలో నిజాయితీగా ఉండటం అసలైన పూజ.అంతరంగంలో శాంతి లేనప్పుడు మనిషి తన బాధ్యతలను నిర్వర్తించడంలో అలసత్వం చూపే అవకాశం ఉంది. అదేవిధంగా, బాధ్యతారహితమైన ఆధ్యాత్మికత కేవలం స్వార్థపూరిత ఆత్మ సంతృప్తికే పరిమితమవుతుంది.ఆధ్యాత్మికత మరియు బాధ్యత అనేవి మనిషి జీవితంలో రెండు కళ్ళ వంటివి. ఒకటి లోపలికి చూస్తే, మరొకటి బయటికి చూస్తుంది. రెండూ కలిసినప్పుడే మనిషి సంపూర్ణ దృష్టిని పొందగలడు. మన సనాతన సంస్కృతి ఎప్పుడూ ఈ రెండింటినీ వేరు చేయలేదు – "వసుధైక కుటుంబం" అనే భావన కూడా ఆధ్యాత్మిక దృక్పథం నుండి పుట్టిన సామాజిక బాధ్యతే.ప్రతి మనిషి తన దైనందిన జీవితంలో చిన్న చిన్న బాధ్యతలను నిస్వార్థంగా, శ్రద్ధగా నిర్వర్తిస్తూ, అదే సమయంలో తన అంతరాత్మతో అనుసంధానం కొనసాగిస్తే, అతని జీవితం సార్థకమవుతుంది. చివరిగా చెప్పాలంటే, నిజమైన ఆధ్యాత్మికత బాధ్యత నుండి పారిపోదు, బదులుగా ఆ బాధ్యతను మరింత పవిత్రంగా, ప్రేమతో నిర్వర్తించేలా మనిషిని ప్రేరేపిస్తుంది. ఈ రెండింటి సమన్వయమే నేటి సమాజానికి కావలసిన నిజమైన మార్గదర్శకత్వం.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# కాటి కాపరి..!

కాటికే కాపరి కాదు జీవం లేని మనుషులు ఉండే మరో సామ్రాజ్యానికి కూడా ఆయనే కాపరి. చీకటితో సావాసం, ప్రాణం లేని శవాలతో స్నేహం, అస్తిపంజరాలతో అనుబంధం. సాధారణ మనుషులు చూస్తేనే బుగులు పడే రాజ్యానికి ఆయన అధిపతి. గోచిపెట్టి చేతికి దండె కడెం వేసి నెత్తికి రుమాలు చుట్టి మీసాలు మెలేసి కిర్రు చెప్పులు తొడిగి కర్ర పట్టి ఒకసారి స్మశానవాటికలోకి అడుగుపెడితే కాలభైరవుడు, గరలకంటుడు, యమకింకరుడు అన్ని తానే ఏకపాత్రాభినయం ఆయనే కాటికాపరి.సమాజంలో మనుషులు ఆస్తిని అంతస్తుని బట్టి, స్థాయిని స్థానాన్ని బట్టి చనిపోయిన వారికి శవం, పీనుగ, మృతదేహం, భౌతికకాయం, పార్థివదేహం అని పలు పేర్లతో వారి స్థాయిని బట్టి పిలుచుకుంటారు. కానీ స్మశానంలో కాటికాపరి దగ్గర జీవం లేని మాంసపు ముద్దలన్ని సమానమే..! ఆయన హెచ్చుతగ్గులు స్థాయిలు స్థానాలు చూడడు కొమ్ములు తిరిగిన రాచకుబేరుడైన, కటిక దరిద్రంతో ఉన్న పేదవాడైన, అగ్రకుల అదికుడైనా, దళిత వర్గ దారిద్ర రేఖకు దిగువ ఉన్నోడైన అందరిని ఒకే అగ్నితో ఆహుతి చేస్తాడు అదే కర్రతో బూడిద చేస్తాడు. తలకెక్కిన మధం మస్తిని, కుళ్ళు కుతంత్రాలను, పొగరు గర్వాన్ని చితి అనే నిప్పుల కొలిమిలో చితా భస్మం చేస్తాడు. సమాజంలో ఉండే అసమానతలు రుగ్మతలు కాటికాపరి ఏ విధంగా పరిచ్ఛేదనం చేస్తాడో ఇక్కడ స్పష్టంగా గమనించవచ్చు.విశ్వకవి గుర్రం జాషువా తన కళాఖండం చేత సత్య హరిచంద్ర పద్యంలో చెప్పినట్టుగా ఇచ్చోటనే కవీంద్రుని కలం నిప్పులలో కరిగిపోయే, ఇచ్చోటనే భూమిలేలు రాజన్యుని అధికారం అంతరించే, ఇచ్చోటనే లేత ఇల్లాలు నల్లపూసల సౌరు గంగలో



కలిసిపోయే..!

**ఆ చోటే.. ఆ రంగస్థలమే.. స్మశాన వాటిక దానికి రారాజే కాటికాపరి..!**

మానవులు జీవించి వుండగా వెళ్ళటానికి చూడటానికి యిష్టపడని ప్రదేశాలు రెండు ఒకటి వైద్యశాల రెండు శ్మశానం/వల్లకాడు/రుద్రభూమి. "జాతస్య హి ధ్రువం మృత్యు". పుట్టిన ప్రతి వాడు గిట్టక తప్పదు. చావును తప్పించుకున్న వాడెవ్వడూ లేడు ధరణిలో అందరు ప్రస్థాన ముకేగవలసిన వారే అయినను శ్మశానం అనే పేరు వినగానే మనస్సు కీడు శంకిస్తుంది, ఏదో భీతి మదిలో గుబులు. రాత్రుళ్ళు, మధ్యాహ్నం అటువైపు వెళ్ళటానికే జంకు.

ప్రకృతి గతి తప్పి, ఆకాశంలో కారుమబ్బులు కమ్మి చిమ్మచీకటి నిండి, దయ్యాలు, గూడ్లగూబలు చెరలాడుచు, కాకులు ముకమ్మిడిగా గోలచేసిన జనవాసం భీతిల్లుతుంది. కాని ఈ శ్మశానవాటికలో భీతికి తావేలేదు. అంతా నిశ్శబ్దం... శ్మాశాన నిశ్శబ్దం...

ఈ రుద్ర భూమికి చెడ్డవాడు, మంచివాడనే తేడాలేదు. యాజమాని, సేవకుడనే వ్యత్యాసం లేదు. హతుడు హంతకుడు యిద్దరు సమానమే ఈ నేలలో కవి, రాజు, లేత ఇల్లాలి మాంగల్యం, చిత్రకారుడు ఎవ్వరైతేనేమి ఆయుస్సు తీరాక యిక్కడ విశ్రమించవలసిన వారే! సృష్టికి లయకారుడు శివుడు. ఆయనకిష్టమైనది తాండవం అట్టి శివ తాండవానికి అనువైనది ఈ శ్మశానవాటిక కన్నమిన్న ఏమున్నది. ఈ వాటిక శివుడు తన పిశాచ అనుచరగణంతో నాట్యమాడు రంగస్థలం.. అంతేకాదు ఈ రుద్రభూమి మరణదూత భూమిని పాలించు బూడితతో చేసిన సింహాసనం..!ఆ రుద్ర భూమిని పాలించే కాటికాపరి నేడు ఎక్కడున్నడు ఎట్లున్నడు..? ఉపాధి లేని బతుకంతా ఉపాసమే. కాటిలోని శవాలే ఆస్తి, ఆర్తనాధాలే తన ఆకలి, స్వేద రంధ్రాల గుండా వచ్చే చెమటే తన ఆహారం.

ఎన్నో శవాలను ఖననం చేసిన కాటికాపరికే తను మరణిస్తే కార్యం చేయడానికి ఆరడుగుల జాగ ఉండదు. తల దాచుకోవడానికి సరైన గూడు ఉండదు, కడుపుకు నచ్చే కూడు ఉండదు, శరీరాన్ని దాచుకునే గుడ్డ ఉండదు. కాటికాపరి జీవితమంతా దుర్భరమే ఆయన బతికీడ్చు రోజులన్నీ దౌర్భాగమే. తరాలు మారుతున్నాయి, యుగాలు మారుతున్నాయి, మానవ జీవన విధానం మారుతుంది, మనుషులు మారుతున్నారు కానీ పేదలు కటిక దరిద్రంలోకే నెట్టి వేయబడుతున్నారు.

ఈద శేఖర్ -70369 97589

## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నీ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి : తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్

**చేగుంట వెలుతురు జూలై 26:**

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నా పోస్టర్ ను తపస్ చేగుంట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేశ్,తంగేళ్ల పల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ వరంగల్ ఏకశిలా పార్కు వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ధర్నాకు హాజరై, అప్పటి పిసిసి ప్రెసిడెంట్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేము అధికారంలోకి వచ్చిన 100 రోజులలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు హామీలను నెరవేర్చకపోవడం శోచనీయమని, 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన జీతాన్ని వెంటనే చెల్లించాలని,కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా జీఓ 317 బాధితులందరికీ న్యాయం, సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు, పెండింగ్ డిఏలను, జిపిఎఫ్ బకాయిల విడుదల, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపే పిఆర్సి అమలు, మోడల్ స్కూల్, కేజీబివి, గురుకుల,రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పదవి విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్, తపస్ జిల్లా కార్యదర్శి సుమతి, కార్యవర్గ సభ్యులు రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# జాతీయవాదుల ఐక్యతే ఈ దేశానికి శ్రీరామరక్ష

ప్రజాస్వామ్య దేశాలలో ప్రభుత్వాలు మారాలన్న కొత్త పార్టీలు అధికారులు కి రావాలన్నా ఐదేళ్లకోసారి ఎన్నికల్లో వారు పాల్గొని ప్రజల్ని మెప్పించి అనుకూలంగా ఓట్లు ప్రజలు వేసేటట్లు మద్దతు కూడగట్టి అప్పుడు మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఒక రకం. అయితే ప్రజల చేత పదేపదే చిట్కారానికి గురవుతున్నటువంటి పార్టీలు వ్యక్తులు వారి పార్టీ సిద్ధాంతాల్లోని లోపాలని గుర్తించకుండా తమకు తాము ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా మలుచుకోకుండా ప్రజల అభిమానికి వ్యతిరేకంగా దొడ్డిదారిన అరాచకాన్ని సృష్టించి అధికారాన్ని లాక్కోవడం మరో రకం. ఇప్పుడు భారతదేశంలో ఈ రెండో రకం ప్రయత్నాలు జరుగుతున్నాయి తస్మాత్ జాగ్రత్త.

ప్రపంచంలో నేడు అనేక అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. రష్యా యుక్రెయిన్ యుద్ధం గత ఐదు సంవత్సరాలుగా జరుగుతుంది, ఇరాన్ అమెరికా యుద్ధం ఇప్పటికీ సాగుతోంది, హార్మోస్ జల సంధి దిగ్బంధన కారణంగా ప్రపంచంలో ఇంధనం కొరత ఏర్పడింది. ఇటువంటి అనేక ఇబ్బందులు కారణంగా ప్రపంచంలో అనేక దేశాల ఆర్థిక పరిస్థితి దెబ్బతిని ద్రవ్యోల్బణం పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కానీ భారతదేశం లో మాత్రమే వృద్ధిరేటు గణనీయంగా పెరుగుతోంది ద్రవ్యోల్బణం అదుపులో ఉంది ఎగుమతులు రికార్డ్ స్థాయి అందుకుంది. దీనికి కారణం దేశంలో పటిష్టమైన నాయకత్వం అదే ప్రధాని నరేంద్ర మోడీ.

ఈ అభివృద్ధిని చూడలేని తట్టుకోలేని ఇంట బయట దొంగలు ఏకమయ్యారు. దేశంలో ఏ చిన్న సమస్య ఉన్నా దాన్ని పెద్దది చేయటం, సమస్య కాకపోయినా దాన్ని సమస్యగా చిత్రీకరించి ప్రజల్ని రెచ్చగొట్టడం దాని మాటున అసాంఘిక శక్తులని చెప్పించి హింసకి పాల్పడటం వంటి రాక్షస క్రీడకి తెరతీసాయి. ఇరుగుపొరుగు దేశాలలో చిన్న సమస్యలని పెద్దదిగా పెంచి అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాలు దించగలిగినప్పుడు భారతదేశంలో కూడా ఎందుకు చేయలేమని ఈ దేశద్రోహులు యొక్క ఆలోచన. రైతులకి మంచి చేసే రైతు చట్టాల పైన అసత్య ప్రచారాలు చేసి రెచ్చగొట్టడం, పౌరసత్వ సవరణ చట్టంపై అబద్ధాలు చెప్పి ముస్లింలను ఉసిగొలపటం గతంలో చేసి అల్లర్లు సృష్టించి మోడీ ప్రభుత్వాన్ని దించటానికి విశ్వప్రయత్నం చేస్తే నేడు నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో కూడా చేస్తున్నది అదే.

ప్రశ్న పత్రాలు ప్రవేశ పత్రాల లీకేజీ ఈ దేశంలో దశాబ్దాలుగా జరుగుతుంది అది ఏ పార్టీ ఏ ప్రభుత్వం దానికి అతీతం కాదు. జులై 19వ తారీఖున కూడా పంజాబ్ రాష్ట్రంలో ఫార్మసీ ఉద్యోగాల పరీక్ష పేపర్ లీక్ అవ్వటమే దీనికి నిదర్శనం. అక్కడుంది అరవింద్ కేజరి ఇవ్వాలి గారి ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం. ఆ రాష్ట్రంలో ప్రజలకి సమాధానం చెప్పని అరవింద్ కేజ్రివాల్ ఢిల్లీకి వచ్చి శుద్ధపూస కబుర్లు చెప్పటమే హాస్యాస్పదం. దేశంలో కృష్ణ పత్రాల లీకేజీ పై విద్యార్థులు ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రజాస్వామ్యతంగా నిరసనలు చేయటం తప్పులేదు కానీ దాని ముసుగులో ఏ రకంగా దేశ విదేశాల నుండి అరాచక శక్తులు పాల్గొనటమే ఆందోళనకరం. విదేశీయులు కూడా వచ్చి జంతర్ మంతర్ ధర్నాలో ఎందుకు పాల్గొంటున్నారు..?? స్విగ్గి జొమాటోలో దేశ విదేశాల నుండి పిజ్జాలు బర్గర్లు బిర్యానీలు ఎందుకు ఆర్డర్ పెడుతున్నారు..?? పాకిస్తాన్ బంగ్లాదేశ్ సోషల్ మీడియా హ్యాండిల్స్ హిందూ పేర్లతో ఎందుకు రెచ్చగొడుతున్నారు..?? నిరసన స్థలంలో హిందూ దేవతల్ని ఎందుకు దూషిస్తున్నారు..?? భరతమాతని ఎందుకు అవమానిస్తున్నారు..?? భారతదేశాన్ని ముక్కలు చేస్తామని ఎందుకు నినాదాలు చేస్తున్నారు..?? శ్రీరాముని సీతమ్మవారిని ఎందుకు దూషిస్తున్నారు..?? వీటికి నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ కి ఏంటి సంబంధం..??

దేశ ప్రజలు ముఖ్యంగా జాతీయవాదులు అందరూ అర్థం చేసుకోవాలి. దేశ విదేశాలలో కుట్రలు రచించి విద్యార్థులని ముందు పెట్టి కాంగ్రెస్ కమ్యూనిస్టులు దేశ వ్యతిరేక శక్తులు ఢిల్లీ వీధుల్లో అరాచకాన్ని సృష్టించి మన ఇరుగుపొరుగు దేశాలలో ఏ రకంగా ప్రభుత్వాలని మార్చారో ఆ రకంగా మార్చాలని వాళ్ళ ఉద్దేశం. వాళ్ల దుర్మార్గపు కోర్కెలకు మన విద్యార్థులు బలి కాకూడదనే కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ గారు రాజీనామాని ప్రధాని మోడీ గారికి పంపించారు.

ఏ ప్రపంచ శక్తికి తలవంచకుండా దేశ ప్రజల సంక్షేమమే పరమావధిగా నిస్వార్థంగా నిజమైన దేశభక్తుడిగా పని చేస్తున్నది ప్రధాని నరేంద్ర మోడీ గారు. ఇది మనం చెప్పటం కాదు అనేక దేశాలు పలుమార్లు చెప్పారు. ఇటువంటి వ్యక్తిని ఇటువంటి పార్టీని తప్పిస్తే గాని ఈ దుర్మార్గుల దోపిడీకి అవకాశం రాదు. అందుకే ఈ ముష్కర మూకలు ఏకమై అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని ప్రజాస్వామికంగా దించాలన్న ప్రయత్నాలు గతంలోనూ చేశాయి నేడు చేస్తున్నాయి రేపు కూడా చేస్తాయి. దేశభక్తులైన ప్రజలు జాతీయవాదుల ఐక్యతే ఈ దేశానికి శ్రీరామరక్ష. దేశాభివృద్ధి ధ్యేయంగా పనిచేసే మనం ఇప్పుడున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా మరింత సంఘటితం కాక తప్పదు.




పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

# అక్రమ నిర్మాణాలపై చక్రం తిప్పిన న్యాక్ ఇంజనీర్?.. నగరంలో జోరుగా చర్చ..

- ఒక్కో అంతస్తుకు లక్షలు - అక్రమ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్..
- కూకట్ పల్లిలో అక్రమ నిర్మాణాలు - వసూళ్ల కోసమే తనిఖీలు చేస్తున్న అధికారులు..

**కూకట్ పల్లి జూలై 26 వెలుతురు:**









సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్ పల్లి, బాలాజీ నగర్, కెపిహెచ్బి కాలనీ, వసంత నగర్, గాయత్రి నగర్, 9వ పేస్ లలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులు ప్రారంభమైన తొలి దశలోనే తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించే అవకాశం ఉన్నప్పటికీ, అధికారులు మౌనం పాటిస్తున్నారని అంటున్నారు. అయితే భవనం దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్న తర్వాత అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహిస్తూ నోటీసులు జారీ చేయడం, అనంతరం రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన ఓ న్యాక్ ఇంజనీర్ వ్యవహార శైలిపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వ్యవహారంలో ఓ న్యాక్ (NAC) ఇంజనీర్ చక్రం తిప్పుతూ అంతా తామే చూసుకుంటామని అక్రమ నిర్మాణదారుల వద్ద నుండి లక్షల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ న్యాక్ ఇంజనీర్ ఇటీవల ట్రాన్స్ఫర్ అయిన అధికారుల పేర్లు చెబుతూ ఒక్కో అదనపు అంతస్థకు లక్షల రూపాయలు వసూలు చేసి అక్రమ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు స్థానికులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల ప్రకారం, అనుమతులు లేని లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, కొందరు వ్యక్తులతో కుమ్మక్కై భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల రహదారులపై ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా కొన్ని నిర్మాణాలపై చర్యలు లేకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే ప్రాంతంలో కొన్నింటిపై చర్యలు తీసుకుంటూ, మరికొన్నింటిని పట్టించుకోకపోవడంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ, కొంతమంది అధికారులపై వస్తున్న ఆరోపణలు ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలను వెలికితీసి, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వసూళ్లకోసమే తనిఖీలు: అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉంటాయి. కాలనీలు, బస్తీల్లో పర్యటిస్తూ అలాంటి నిర్మాణాలు కనిపిస్తే జోనల్ కమిషనర్‌కు తెలియజేయాలి. ఆ తర్వాత వాటిపై చర్యలు తీసుకోవాలి. కానీ ఈ బృందాల్లోని కొందరు న్యాక్ ఇంజినీర్లు వసూళ్లకు పాల్పడి అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇస్తున్నారు.





# చిన్న శంకరపల్లిలో రూ. 5 లక్షలతో భూగర్భ మురుగునీటి కాలువ పనుల ప్రారంభం

**శంకరపల్లి, వెలుతురు జులై 26:**



శంకరపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు చిన్న శంకరపల్లిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వార్డు ప్రజల చిరకాల సమస్యను పరిష్కరిస్తూ, రూ. 5 లక్షల మున్సిపల్ నిధులతో నూతనంగా నిర్మించ తలపెట్టిన భూగర్భ మురుగునీటి కాలువ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులను మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ ఆదివారం అధికారికంగా ప్రారంభించారు. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.వార్డులో మురుగునీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ నిధులను కేటాయించినట్లు చైర్మన్ తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు ఉషా కిరణ్, విజయ్ కుమార్, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, స్థానిక నాయకులు రవీంద్రరెడ్డి, భాస్కర్, నర్సింలు, కృష్ణ, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**శంకర్ పల్లి, వెలుతురు జులై 26:**




మున్సిపల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని మున్సిపల్ పరిధిలోని మణిహర్దెన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 30 ఏండ్ల తరువాత ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడుతూ తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను గుర్తించుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి: మాధవరం రోజా దేవి

**కూకట్ పల్లి, జూలై 26 వెలుతురు:**



కూకట్‌పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ఆదివారం పరిశీలించారు. అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో) వహీద్ అలీతో కలిసి రిక్షా పుల్లర్స్ కాలనీ, రామకృష్ణ నగర్, వెంకటేశ్వర్ నగర్ (33, 34, 35 బ్లాక్‌లు), మాధవరం నగర్ కాలనీ, నాగార్జున స్కూల్, కమల ప్రసన్న నగర్ బూత్‌లలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరం రోజా దేవి మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణను పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను కోరారు. ప్రతి అర్హుడైన ఓటరికి ఓటు హక్కు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, చిరునామా మార్పులు వంటి ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు కూడా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత బూత్ లెవల్ అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, జగదీష్ గౌడ్, రవీందర్ రావు, ప్రవీణ్, బాబు, మధు, కొండలరావు, శ్రీశైలం గౌడ్, నరేందర్, సుధాకర్, సత్యనారాయణ, రమేష్ రావు, రాజేందర్, రాంచందర్, శామ్‌రావు, సతీశ్, విక్రమ్, యాకన్న, లక్ష్మణ్, సుదర్శన్, శంకర్, రమేష్, సంతోష్, శ్రీధర్ రావు, మహేష్, జై, చిన్న, అరవింద్, కుమార్ యాదవ్, శైలజ, లక్ష్మీకాంతమ్మ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవుల సేవలో ఐబీఎస్ విద్యార్థులు

**బ్రీత్ అనిమల్ షెల్టర్‌లో సేవా కార్యక్రమం**

**శంకర్ పల్లి, వెలుతురు జులై 26 :**



మండల పరిధి ఐబీఎస్ లోని సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్, క్లబ్ ఆయినా సంయుక్త ఆధ్వర్యంలో, టీమ్ న్యూస్‌వైర్, ఐ ఎఫ్ హెచ్ ఈ బ్లూస్, క్లబ్ నజారియా సహకారంతో దుండిగల్ బౌరంపేట్‌లోని బ్రీత్ అనిమల్ షెల్టర్లో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి వాలంటీర్లు నిరాశ్రయ, గాయపడిన జంతువులకు ఆహారం అందించి, వాటి సంరక్షణలో షెల్టర్ సిబ్బందికి సహకరించారు.షెల్టర్ నిర్వాహకులు జంతు సంక్షేమం, బాధ్యతాయుతమైన పెంపుడు జంతువుల సంరక్షణ, కొనుగోలు చేయడం కంటే రక్షించబడిన జంతువులను దత్తత తీసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.





ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, కరుణ, సామాజిక బాధ్యత మరింత పెంపొందిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ సమన్వయాన్ని శరణ్య, వినీత, కీర్తి, యద్నేశ్, దిశ, కబీర్, అక్షుణ్, సుష్మ, స్నేహ తదితరులు విజయవంతంగా నిర్వహించారు.

# 54 వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు

- తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 26:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 294 డివిజన్ బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీ కాలనీ దగ్గర, నిర్వహించిన 54 వ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ,294 డివిజన్ బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుత్బుల్లాపూర్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, భూపతి రెడ్డి , శ్రీధర్ రెడ్డి , కావలి గణేష్ , శ్రీశైలం యాదవ్ , సాధు యాదవ్ , నర్సింహారెడ్డి , అమర్ పటేల్, బీరా యాదవ్, శివారెడ్డి , 294 డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ వాసులు మరియు టీమ్ బికెఆర్ సభ్యులు పాల్గొన్నారు



# ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు గొరిగే సోములు
- గ్రామపంచాయతీ ఎంప్లాయిూస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము




**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 26:**


కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, గ్రామపంచాయతీ ఎంప్లాయిూస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము పిలుపునిచ్చారు. రామన్నపేటలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల బిక్షం అధ్యక్షతన జరిగిన గ్రామపంచాయతీ కార్మికుల మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, శాశ్వత ఉద్యోగాల స్థానంలో తాత్కాలిక నియామకాలను ప్రోత్సహించడం వల్ల కార్మికుల ఉపాధి భద్రత దెబ్బతింటోందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, కనీస వేతనాల అమలు, పోస్టల్ ఇన్సూరెన్స్ ప్రతి గ్రామపంచాయతీలో అమలు చేయాలి ఆన్లైన్ లేని కార్మికుల పేర్లు ఆన్లైన్లో నమోదు చేయాలి. గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా పథకాల అమలు వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్మికులు, ఉద్యోగులు, 1ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సీఐటీయు జిల్లా కమిటి సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, అప్పం సురేందర్ కాడ యాదమ్మ బొడ్డు సాలయ్య, మంటి అంజయ్య, నల్ల సుగుణమ్మ, బంటు ఇస్తారమ్మ, ఉప్పునూతల నరసింహ, కందాల నర్సమ్మ ఇస్తారు. రాములు, నాగరాజు, పూలమ్మ, అలివేల, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలాంటి వర్గ భేదాలు లేవని బూతు స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతమే మా ముఖ్య ఎజెండా

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి

**నూతనకల్ జూలై26 ( వెలుతురు)**

తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి వర్గ బేధాలు లేవని, బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే మా ముఖ్య ఏజెండాని నూతనకల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమక్షంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు వెళుతుందని, జరిగిన ఈ రెండున్నర సంవత్సరాలలో 40 కోట్ల నిధులతో మన మండలాన్ని అభివృద్ధి పథం లో ఉంచారు అని గత పది సంవత్సరాలుగా ఈ నియోజకవర్గం ఏటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోలేదు అని మన



ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఎన్నికైనప్పటి నుండి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ తుంగతుర్తి నియోజక వర్గాన్ని ముందంజలో ఉంచుతున్నారు. ఇది గిట్టని కొంత మంది విమర్శకులు విమర్శలు చేస్తున్నారు. మందులు సామెల్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన వ్యక్తి అని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడం ఈ రెండు తోడై సామేల్ ఈ నియోజకవర్గంలో 52 వేల మెజారిటీతో ఘన విజయం సాధించడం జరిగిందని గుర్తు చేశారు.తుంగతుర్తి నియోజకవర్గంలో ఎటువంటి వర్గాలు లేవు చిన్నచిన్న సమస్యలు ఏమైనా ఉన్నప్పటికీని అది పార్టీ అధిష్టానం చూసుకుంటుంది అని మల్లారెడ్డి అన్నారు. మన కాంగ్రెస్ పార్టీ నాయకులంతా ఒకటిగా పోరాడి మన తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ఉంచుకుందాం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు అనంతుల శ్రీనివాస్ గౌడ్,దీప శంకర్ నాయక్,జ్యోతి సుధాకర్,నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గోరుగంటి రామకిషన్ రావు,దరిపెల్లి వీరన్న, సైరెడ్డి రెడ్డి సుధీర్ రెడ్డి, చురకంటి చంద్రారెడ్డి,కృష్ణ ప్రశాంత్, అంబెద్కర్, నాగమల్లు, ఇరుగు కిరణ్, అశోక్,బంటు బద్రి, క్రాంతి,శ్రీకాంత్, మధు,వీరబాబు నవీన్,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# చెర్వుగట్టు అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**బాధితులకు ప్రభుత్వం తరపున తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలి**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 26:**

నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కట్‌పల్లి మండలంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామ లింగేశ్వర స్వామివారి గుట్ట కింద ఆదివారం (జూలై 26) తెల్లవారుజామున సంభవించిన భారీ అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.ఈ ఘటన సమాచారం అందుకున్న వెంటనే నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధితులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.ప్రాథమిక సమాచారం ప్రకారం గుట్ట కింద నంది విగ్రహం, గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోని ఓ బొమ్మల దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గాలుల ఉధృతికి మంటలు క్షణాల్లోనే సమీపంలోని ఇతర దుకాణాలకు వ్యాపించాయి. దుకాణాల్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు వరుసగా పేలిపోవడంతో మంటలు మరింత తీవ్రరూపం దాల్చాయి.ఈ ప్రమాదంలో సుమారు 17 నుంచి 25 దుకాణాలు, 15 తోపుడు బండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు గ్రామపంచాయతీ కార్యాలయానికి కూడా వ్యాపించి, అక్కడ ఉన్న పలు కీలక దస్త్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో దుకాణాల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది.అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజిన్ల సహాయంతో గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ, సర్వస్వం కోల్పోయిన పేద



వ్యాపారులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి తగిన ఆర్థిక సహాయం అందించాలని, వారి జీవనోపాధి పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, మేకల రాజిరెడ్డి, దుబ్బ రవికుమార్, నడింపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ కల్తీ అల్లం పేస్ట్ తయారీ కేంద్రం పై పోలీసులు దాడి




- అక్రమంగా తయారు చేస్తున్న యూనిట్ పై కేసు నమోదు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 26:**

భారీ కల్తీ అల్లం పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి – అక్రమంగా తయారు చేస్తున్న యూనిట్‌పై కేసు నమోదు యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు, చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో, రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. రవి , రామన్నపేట ఎస్సై జి. సతీష్ మరియు పోలీసు సిబ్బంది రామన్నపేట సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా, అందులో ఎటువంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో అల్లం పేస్ట్ డబ్బాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్‌ను విచారించగా, ఈ అల్లం పేస్ట్ కీసర ప్రాంతంలోని ఒక తయారీ యూనిట్‌లో తయారు చేసినట్లు తెలిపాడు.దీనిపై వెంటనే పోలీసులు కీసరలోని సంబంధిత తయారీ కేంద్రానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో, కల్తీ అల్లం పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం సంబంధిత ప్రాంగణంలో సోదాలు నిర్వహించి, కల్తీ తయారీకి సంబంధించిన ముడి పదార్థాలు, యంత్రాలు, తయారైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణాపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని హెచ్చరించారు.ఈ చర్యను స్థానిక ప్రజలు అభినందిస్తూ, జిల్లా పోలీసు యంత్రాంగం మరియు ఫుడ్ సేఫ్టీ అధికారులను ప్రశంసించారు.

# చెరువుగట్టు అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన బీజేపీ నాయకులు

- నష్టపరిహారం ఇవ్వాలంటూ ధర్నా చేసిన నాయకులు

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 26:**

ఆదివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టు పుణ్యక్షేత్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో 17 దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన విషయం తెలుసుకున్న బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్, మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, ఏపీ లింగోటం ఉపసర్పంచ్ కొరివి శంకర్ తదితరులు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే



పూర్తి నష్టపరిహారం అందించాలని, కాలిపోయిన దుకాణాలను ప్రభుత్వమే పునర్నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.చెరువుగట్టు వంటి వేలాది మంది భక్తులు సందర్శించే ప్రముఖ పుణ్యక్షేత్రంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఫైర్ ఇంజన్, అంబులెన్స్ వంటి అత్యవసర సేవలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హిందూ పుణ్యక్షేత్రాల ద్వారా వచ్చే ఆదాయంపై మాత్రమే దృష్టి పెట్టి, భద్రతా ఏర్పాట్లను నిర్లక్ష్యం చేయడం బాధాకరమని పేర్కొన్నారు.అనంతరం బాధితులతో కలిసి బీజేపీ నాయకులు ధర్నాలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నడింపల్లి శ్రవణ్ కుమార్, మునుకుంట్ల గణేష్, పిట్టల నాగన్న, పాలకూర రమేష్, మద్రి హరీష్, వడ్డేగోని రామలింగం తదితరులు పాల్గొన్నారు.

# చెర్వుగట్టులో భారీ అగ్నిప్రమాదం.. 17 దుకాణాలు దగ్ధం, రూ. 2.5 కోట్ల ఆస్తి నష్టం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 26:**

నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామివారి గుట్ట కింద ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బొమ్మల దుకాణంలో ప్రారంభమైన మంటలు వేగంగా వ్యాపించి మొత్తం 17 దుకాణాలు, 15 తోపుడు బండ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.స్థానికుల సమాచారం ప్రకారం, మంటల తీవ్రత కారణంగా ఘటనాస్థలంలో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు పేలిపోవడంతో మంటలు మరింత ఉధృతమయ్యాయి. అనంతరం మంటలు సమీపంలోని గ్రామపంచాయతీ కార్యాలయానికి కూడా వ్యాపించగా, కార్యాలయంలోని పలు కీలక దస్త్రాలు అగ్నికి ఆహుతయ్యాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మూడు ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకుని గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు, గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టడంతో మంటలు మరింత విస్తరించకుండా అడ్డుకోగలిగారు.

చెరువుగట్టు గ్రామపంచాయతీ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య తెలిపిన ప్రాథమిక అంచనా ప్రకారం, ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.2.5 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించింది. దుకాణాల్లోని బొమ్మలు, పూజా సామగ్రి, ఇతర వ్యాపార వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

అయితే ప్రమాదం అర్ధరాత్రి సమయంలో జరగడం, ఆ సమయంలో దుకాణాల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. లేకపోతే భారీ విషాదం చోటుచేసుకునేదని స్థానికులు పేర్కొన్నారు.




# నూనెగూడెం గ్రామంలో బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమం



**గుండాల జులై 26:(వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం లో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భారతీయ జనతా పార్టీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఈరోజు నూనెగూడెం గ్రామంలో మండల అధ్యక్షుడు పింగళి విజయ్ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో BLO మరియు BLA-2లతో సమావేశమై ఓటరు జాబితాకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో 1,200 మందికి మించకుండా ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా బూత్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, నూనెగూడెం గ్రామానికి సంబంధించిన ప్రధాన సమస్యలైన బస్సు సౌకర్యం, రెవెన్యూ గ్రామ హోదా, రోడ్డు సౌకర్యం వంటి అంశాలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో మల్లయ్య, నాగిరెడ్డి, వివాకర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ కుటుంబానికి 4,10,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేత



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 26:**

యాదాద్రి భువనగిరి ఫోటో&వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయం భూదాన్ పోచంపల్లిలో ప్రారంభోత్సవ కార్యక్రం సందర్బంగా యాదాద్రి జిల్లా రామన్నపేట మండలంకు చెందిన నకిరేకంటే మహేష్ ఇటీవలే మృతి చెందగా వారు 10 రూపాయల భరోసా,మరియూ 100 రూపాయల భరోసాలో ఉన్నందున వారి కుటుంబానికి రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ మరియూ రాష్ట్ర కమిటీ వారి చేతుల మీద వారి కుటుంభ సభ్యులకు 4,10,000 నాలుగు లక్షల పదివేల రూపాయలను అందజేయడం జరిగింది.

# జాతీయ వాగ్దేవి పురస్కారానికి జహీరాబాద్ ముద్దుబిడ్డ ఢిల్లీ వసంత్ ఎంపిక

- **28న న్యూఢిల్లీలో కేంద్ర మంత్రుల చేతుల మీదుగా అవార్డు ప్రదానం...**
- **తెలంగాణ ఉద్యమం, రైతు పోరాటాలు, గ్రామాభివృద్ధి సేవలకు గుర్తింపు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 26:**

తెలంగాణ ఉద్యమకారుడు, జాతీయ రైతు నాయకుడు, జహీరాబాద్‌కు చెందిన ఢిల్లీ వసంత్‌కు ప్రతిష్ఠాత్మక జాతీయ వాగ్దేవి పురస్కారం దక్కింది. ఈ నెల 28న న్యూఢిల్లీలో తెలుగు జాతీయ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే "తెలుగు వెలుగు" సాంస్కృతిక మహోత్సవంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రామ్మోహన్ నాయుడు, పెద్దసాని చంద్రశేఖర్‌తో పాటు పలువురు పార్లమెంట్ సభ్యులు హాజరుకానున్నారు.తెలంగాణ ఉద్యమంలో 19 రోజుల ఢిల్లీ సత్యాగ్రహానికి నాయకత్వం వహించడం, రైతుల సమస్యలను దేశ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆరు రాష్ట్రాల మీదుగా 2,140 కిలోమీటర్ల కిసాన్ పాదయాత్ర చేపట్టడం, చెరుకు రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేయడం, రైతు సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో ఉద్యమాలు నిర్వహించడం వంటి విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన రూ.70 వేల కోట్ల రైతు రుణమాఫీకి దారితీసిన రైతు ఉద్యమాల్లోనూ ఆయన పాత్రకు ప్రత్యేక గుర్తింపు లభించింది.పుణేలోని ఎంఐటీలో విద్యాభ్యాసం చేసిన ఢిల్లీ వసంత్, ఉస్మానియా విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థులతో కలిసి GCOT (గ్రామోదయ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ) సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా గ్రామాభివృద్ధి, విలేజ్ మోనోగ్రాఫ్‌ల రూపకల్పన, వ్యవసాయ ఆధునికీకరణ,



తెలంగాణ సోనా వరి ప్రచారం, మహిళల ఆర్థిక సాధికారత, యువతకు నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అనేక కార్యక్రమాలను చేపట్టారు.అలాగే కరోనా అనంతర ప్రపంచానికి భారతీయ సాంస్కృతిక విలువలను చాటిచెప్పే లక్ష్యంతో "రీ ఇమాజినింగ్ ఇండియా యాజ్ ది గ్లోబల్ పార్లమెంట్" నినాదంతో నిర్వహించిన 7,000 కిలోమీటర్ల కుంభ సందేశ్ యాత్ర విశేష ఆదరణ పొందింది. ఈ యాత్రలో భారత భవిష్యత్తుకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రతిపాదించగా, అనంతరం హరిద్వార్ కుంభమేళాలో వాటికి "హరిద్వార్ డిక్లరేషన్" రూపంలో గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తన ఒక్కరిదే కాదని, తన ప్రతి ఉద్యమంలో అండగా నిలిచిన రైతులు, మహిళలు, యువత, కార్మికులు, మేధావులు, మిత్రులు, జహీరాబాద్ ప్రజలందరికీ చెందిన గౌరవమని పేర్కొన్నారు. సమాజానికి మరింత సేవ చేయాలనే బాధ్యతను గుర్తు చేసే మైలురాయిగా ఈ అవార్డును భావిస్తున్నానని, జహీరాబాద్ అభివృద్ధి కోసం తన సేవా ప్రయాణం మరింత విస్తృతంగా కొనసాగుతుందని తెలిపారు.ఢిల్లీ వసంత్‌కు జాతీయ స్థాయి పురస్కారం దక్కడం జహీరాబాద్ ప్రజలందరికీ గర్వకారణమని పలువురు సామాజికవేత్తలు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# బ్రాహ్మణ సంఘం జహీరాబాద్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- **సమాజ అభివృద్ధికి కృషి చేయాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే పిలుపు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 26:**





ఎన్నికైన నూతన కార్యవర్గం సమాజ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేయాలని బ్రాహ్మణ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే పిలుపునిచ్చారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని రాంమందిర్‌లో బ్రాహ్మణ సంఘం మండల నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండేతో పాటు జిల్లా కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా నాయకులు కిషన్‌రావు బక్షి, బాబురావు జోషి, ప్రభావతి, శ్రీకాంత్ జోషి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రామారావు దేశ్‌పాండే మాట్లాడుతూ, జహీరాబాద్ మండల కార్యవర్గం గతంలో జిల్లా కమిటీ సూచించిన అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని కొనియాడారు. వరుణ యాగం, మాతృభోజనం వంటి సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టి సంఘానికి మంచి గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో నూతన కార్యవర్గం కూడా సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు.ఈ ఎన్నికల్లో పురుష, మహిళా కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు కుల్కర్ణి, ఉపాధ్యక్షులుగా పునీత్ దీక్షిత్, శ్రీనివాస్‌రావు కొల్లూర్, సంయుక్త కార్యదర్శులుగా బూచినెల్లి సురేష్‌కుమార్, రాజ్‌కుమార్ దేశ్‌ముఖ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్ నాయక్, రవి రాందాస్, చరణ్ జోషి, గణేష్ జోషి, డాక్టర్ శ్యామ్ జోషి బాధ్యతలు చేపట్టనున్నారు.మహిళా కార్యవర్గంలో అధ్యక్షురాలిగా అనుపమ కుల్కర్ణి, ప్రధాన కార్యదర్శిగా వందనా దేశ్‌ముఖ్, గౌరవ అధ్యక్షురాలిగా జయ మంగళ కుల్కర్ణి, ఉపాధ్యక్షులుగా వీణా రాందాసి, సుచరిత కుల్కర్ణి, సంయుక్త కార్యదర్శులుగా శైలజ పురోహిత్, రజని షాపూర్, కోశాధికారిగా సంగీత దేశ్‌పాండే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులకు జిల్లా నాయకులు అభినందనలు తెలియజేసి, సమాజ సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం... 2వ, 21వ డివిజన్లలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల పనులకు మేయర్ శంకుస్థాపన

**కరీంనగర్ వెలుతురు జూలై 26:**

కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగర పాలక సంస్థ లక్ష్యమని నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు అన్నారు.నగరపాలక సంస్థ 2వ డివిజన్ చంద్రపూరి కాలనీ తిలక్ నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ హోదాలో మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.అనంతరం 21వ డివిజన్ శ్రీరాంనగర్ కాలనీ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేసి, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను





ఆదేశించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ప్రాధాన్య క్రమంలో కల్పిస్తూ నగరాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం, 26 వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ గారు,మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# జహీరాబాద్–తాండూరు రహదారి దుస్థితిపై సీపీఎం ఆగ్రహం

- **వెంటనే కొత్త రోడ్డు నిర్మించాలి...**
- **అప్పటి వరకు గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టాలి...**
- **జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్. మహిపాల్ డిమాండ్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 26:**







సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నుంచి తాండూరు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్. మహిపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రహదారిని వెంటనే కొత్తగా నిర్మించాలని, అప్పటి వరకు కనీసం గుంతలను పూడ్చి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు జహీరాబాద్–తాండూరు రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ, రహదారి అధ్వాన్న స్థితి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా జహీరాబాద్ పరిశ్రమలకు ప్రతిరోజూ వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండగా, రాత్రి వేళల్లో ప్రయాణించే వారు మరింత ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.ప్రజలు, కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే కొత్త రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, అప్పటి వరకు గుంతలను పూడ్చి మరమ్మతులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు మల్లేష్, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో బోనాల వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 26:**

కరీంనగర్ నగరంలోని చింతకుంట, రాంనగర్, కిసాన్ నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, అలాగే మార్కండేయ నగర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన పోచమ్మ, పెద్దమ్మతల్లి బోనాల మహోత్సవాల్లో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొన్నారు.ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్ శ్రీనివాస్ గారు రాష్ట్రంలో, జిల్లాలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం భక్తులతో కలిసి బోనాల ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగ ప్రజల ఐక్యతకు, భక్తి భావానికి నిదర్శనమని అన్నారు.

ఇలాంటి సాంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో కరీంనగర్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతో









షాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజరామ శివరాం, తెల్ల లక్ష్మీ రమేష్, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గడ్డి ప్రదీప్, భారీ అపర్ణ జితేందర్, వైద్యుల అంజన్ కుమార్, మల్లికార్జున రాజేందర్, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల సరిత అశోక్, చల్ల స్వరూప రాణి హరి శంకర్, మున్నూరు కాపు సంఘం, పద్మశాలి సంఘం ప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని వీక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 26:**





కరీంనగర్ నగరంలోని 23వ డివిజన్ సీతారాంపూర్ సూర్యనగర్ కాలనీలో 61వ బూత్ అధ్యక్షుడు కాల్వల జితేందర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి నెల నిర్వహించే "మన్ కీ బాత్" కార్యక్రమం ద్వారా దేశ ప్రజలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ, దేశాభివృద్ధి, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, యువత పాత్ర, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటి అనేక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించి అందులోని సందేశాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజ్, బూత్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, చొల్లేటి యుగేందర్ రెడ్డి, కొత్త సతీష్ రెడ్డి, రాజిరెడ్డి, మోహన్, వెలిచాల రవీంద్ర, ద్యావ సత్యనారాయణ, గోపాల్ చారి, సంతోష్ కుమార్, హర్షవర్ధన్, దాడి పవన్ తో పాటు అధిక సంఖ్యలో డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో వినూత్న స్టార్టప్.. ప్రజలకు అందుబాటులో 'జిప్లో' యాప్

- **'జిప్లో' స్టార్టప్ యాప్ ను ప్రారంభించిన స్థానిక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాష్ రాథోడ్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 26:**

డిజిటల్ యుగంలో స్థానిక వ్యాపారులు, వినియోగదారులు మరియు వివిధ రంగాలకు చెందిన సేవలందించే వారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించిన "జిప్లో (Zyplo) – ఆల్ ఇన్ వన్ హైపర్ లోకల్ యాప్" జహీరాబాద్ పట్టణంలో ప్రారంభమైంది. భారత ప్రభుత్వ డీపీఐఐటీ (DPIIT) గుర్తింపు పొందిన ఈ స్టార్టప్ సంస్థ నూతన వ్యాపార సముదాయాన్ని స్థానిక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాష్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.పట్టణంలోని మంకల్ బాంక్వెట్ హాల్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ రాథోడ్ మాట్లాడుతూ, ఆధునిక డిజిటల్ పోకడలకు అనుగుణంగా అన్ని రంగాల సేవలను ఒకే ప్లాట్‌ఫారంపై అందించే జిప్లో యాప్ జహీరాబాద్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారాల అభివృద్ధికి, వినియోగదారులకు సులభమైన సేవల అందుబాటుకు ఈ యాప్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సంస్థ సీఈఓ రమేష్ రాథోడ్, డైరెక్టర్ ప్రియాంక రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, ఆహ్వానితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, సర్పంచులు దాసరి మంచేందర్, కేతావత్ మోహన్, గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచులు అమిత్ కుమార్, జగదీష్, సర్పంచ్ ప్రతినిధి భీమ్‌రావు రాథోడ్, ఎస్టీ సెల్






మండల అధ్యక్షుడు హీరు రాథోడ్, ప్రకాష్ చవాన్, అశోక్, ప్రకాష్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ను వీక్షించిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్

**కరీంనగర్ వెలుతురు జూలై 26:**




ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ మండలం ముక్దంపూర్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తన మన్ కీ బాత్ ప్రసంగంలో దేశ ప్రజలకు అద్భుతమైన దిశానిర్దేశం చేశారని కొనియాడారు. ప్రధానంగా ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశం అన్ని రంగాల్లోనూ స్వయం సమృద్ధి సాధిస్తోందని, దేశ పౌరులు, యువత స్వయంపోషక భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారని తెలిపారు.అలాగే, సైన్స్ మరియు సాంకేతిక రంగంలో దేశం సాధిస్తున్న విజయాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. విక్రమ్ పరీక్షల విజయవంతం వంటి చారిత్రాత్మక విజయాలు దేశ సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటిచెప్పాయని, శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్ అగ్రగామిగా ఎదుగుతోందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. దేశ ప్రగతి కోసం ప్రధాని మోదీ చేపడుతున్న సంస్కరణలను ప్రతి ఒక్కరూ స్వాగతించాలని కోరారు. కార్గిల్ దివస్ సందర్భంగా వీరమరణం పొందిన జవానులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు.

# హిమాయత్‌నగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియకు 15 సహాయ కేంద్రాలు

- **మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు**
- **ఫారాలు నింపడంలో ఇబ్బంది పడుతున్న వారికి సహాయం**
- **వివరాలు సరిచూసి బీఎల్‌వోలకు అందజేత**
- **ఆదివారం డివిజన్‌లోని 15 ప్రాంతాల్లో సేవలు**
- **జి. రామన్ గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తల పర్యవేక్షణ**
- **ప్రజల నుంచి మంచి స్పందన**







**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**

ఆదివారం సందర్భంగా హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో 15 ప్రాంతాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐఆర్ ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఈ కేంద్రాలను నిర్వహించారు.కేంద్రాలకు వచ్చిన ప్రజల వివరాలను సక్రమంగా నమోదు చేసి, ఫారాలను సరిగా నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)కు అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జి. రామన్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేలా సహకరించడమే ఈ సహాయ కేంద్రాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# మాటలు కాదు చేతల్లో చూపించాలి: బొంగు రఘు గౌడ్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు

**హైదరాబాద్ వెలుతురు జూలై 26 :**



రాహుల్ గాంధీ ప్రధాని అవుతారో లేదో ఇంకా తెలియదు. కానీ అప్పుడే తన మంత్రివర్గంలో Gen Zకి విద్యాశాఖ బాధ్యతలు ఇస్తామని ప్రకటించడం ఆశ్చర్యంగా ఉంది.ముందుగా కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న విద్యాశాఖను యువతకు అప్పగించి ఆదర్శంగా నిలిస్తే, ఆ ప్రకటనకు మరింత విశ్వసనీయత ఉండేది. రాజకీయాల్లో హామీలు ఇవ్వడం కంటే వాటిని ఆచరణలో చూపించడమే నాయకత్వానికి నిజమైన కొలమానం.అలాగే, కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కొందరు ప్రతిపక్షాలు తమ విజయంగా ప్రచారం చేయడం సరైనది కాదు. నీట్ పరీక్షల అంశంలో విద్యార్థుల ఆందోళనలను రాజకీయ అవకాశంగా మలచడం కంటే, విద్యా వ్యవస్థను బలోపేతం చేసే నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై కూడా ఉంది.దేశంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా, విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రతి రాజకీయ పార్టీ కర్తవ్యం. ప్రజలకు ఉపయోగపడే ప్రత్యామ్నాయ విధానాలు, సంస్కరణలు సూచించడం ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుంది.రాజకీయాల్లో ప్రజలు మాటలను కాదు, పనితీరును విశ్వసిస్తారు. విమర్శలతో పాటు బాధ్యతాయుతమైన ప్రత్యామ్నాయాలను కూడా ప్రజలు ఆశిస్తున్నారు.

# అంబర్పేట్ దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అమ్మవారి ఘటం ఉరేగింపు

**బషీర్ బాగ్ వెలుతురు 26 జులై:**



అంబర్పేట్ దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఘటం ఉరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు.మోర పండిత్ ముదిరాజ్ గారిచే వివిధ బస్తీల యందు పోతరాజుల విన్యాసాలు, మహిళలు బోనం ఎత్తుకొని అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అమ్మవారి ఘటం ఉరేగింపు లో దేవస్థాన సేవా సమితి సభ్యులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు

# గడువు లోపు ఎస్ఐఆర్‌లో ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవాలి డాక్టర్ సి రోహిన్ రెడ్డి

**బషీర్ బాగ్ వెలుతురు 26 జులై:**



కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత ఖాదర్ షరీఫ్ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ క్యాంప్ ను నిర్వహించారు. అంబర్పేట్ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ సి రోహిన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని వారు కోరారు. గడువు ముగిసే లోపు ప్రజలు తమ వివరాలను బిఎల్‌ఓ లకు అందించాలని సూచించారు,లేని పక్షాన తమ ఓటు హక్కు కోల్పోతారని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు మోతా రోహిత్ , కృష్ణ గౌడ్, భరత్, షబ్బీర్ , దేవేందర్, అబ్దుల్లా, అలీ , అహ్మద్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా నగర్ డివిజన్‌లో మంజీరా పైప్‌లైన్ జంక్షన్ పాయింట్ నిర్మాణ పనులను ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూలై 26:**



ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 292వ డివిజన్ సాయిబాబా నగర్‌లో మంజీరా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో చేపట్టిన పైప్‌లైన్ జంక్షన్ పాయింట్ నిర్మాణ పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా సాయిబాబా నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న మంజీరా తాగునీటి సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి శ్రీధర్ బాబు గారి సహకారంతో ₹50 లక్షల HDF నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆ నిధులతో జంక్షన్ పాయింట్ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ పనులు పూర్తయిన అనంతరం సాయిబాబా నగర్ డివిజన్‌లో మంజీరా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మూడు రోజులకు ఒకసారి ప్రతి ఇంటికీ మంజీరా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికిరణ్, డిసీసీ జనరల్ సెక్రటరీ సొమ్మన్న గారి శ్రీధర్ రెడ్డి, సినియర్ కాంగ్రెస్ నాయకులూ భాస్కర్ రెడ్డి, డిసీసీ సెక్రటరీ కరణ్, చందు, నాగేష్ రెడ్డి, రామచందర్, నరసింహారెడ్డి, సత్తి రెడ్డి, నందగోపాల ప్రసాద్, గఫార్ మరియు మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా మెండెం కిరణ్

- **ఏకగ్రీవంగా ఎన్నిక.. క్రీడారంగ అభివృద్ధికి కృషి చేస్తానన్న హామీ**

**ఖమ్మం, వెలుతురు జూలై 26 :**




ఉమ్మడి ఖమ్మం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా రైట్ ఛాయిస్ అకాడమీ అధినేత మెండెం కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలోని సితార గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆయనను చైర్మన్‌గా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గత పదేళ్లుగా జిల్లాలో యువతను విద్య, ఉపాధి, క్రీడలు తదితర రంగాల్లో ప్రోత్సహిస్తూ మెండెం కిరణ్ విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడ మరింత అభివృద్ధి చెందుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఎన్నిక అనంతరం మెండెం కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు కృషి చేస్తానన్నారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, పోటీల నిర్వహణకు అసోసియేషన్ తరఫున అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు.అసోసియేషన్ అధ్యక్షుడిగా అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వరికూటి మోహన్, కోశాధికారిగా కోపెల తంబి ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అబ్జర్వర్ ఎండీ గౌస్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యుడు రమేష్, ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ ఉప్పల్ రెడ్డి పర్యవేక్షించారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

# మంచాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఓటర్ వివరణ ప్రక్రియ వేగవంతం

**మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన వారి ఓట్లు కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చర్యలు తీసుకోవాలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి**

**మంచాల వెలుతురు జూలై 26:**



మంచాల మండలం మంచాల మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇబ్రహీంపట్నం ఎ మ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంచాల గ్రామంలో బూత్ లెవెల్ ఏజెంట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి ఎస్ఐఆర్ ఓటర్ సవరణ ప్రక్రియను పరిశీలించారు మండలంలోని వివిధగ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రతిగడ పకు వెళ్లి ఎస్ఐఆర్ ఓటర్ నమోదు పత్రాలు ఇచ్చారా లేదా అడిగి తెలుసుకొని స్వయంగా కాం గ్రెస్ పార్టీ నాయకులే పత్రాలు సరిచేసి గ్రామంలోని బిఎల్ఓ అధికారులకు అందజేశారు ఈసం దర్భంగా ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఓటర్ స వరణ ప్రక్రియ సమయం చాలాతక్కువ ఉన్నది కాబట్టి గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రా మాల్లో అర్హులైన ఓట్లు తొలిగి పోకుండా ప్రతీ కార్యకర్త ప్రతినాయకుడు కృషి చేయాలని పిలుపు నిచ్చారు ఈకార్యక్రమంలో మాజీ సొసైటీ డైరెక్టర్ వింజమూరి ప్రేమకర్ రెడ్డి మంచాల గ్రామశాఖ అధ్యక్షుడు రావుల శ్రీని వాస్ మంచాల గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ నారెడ్డి హరికిష న్ రెడ్డి గ్యారజగన్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మొదట మీరు ఇక్కడ విద్యాశాఖ మీద దృష్టి పెట్టండి

- **మీరు ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు**
- **మరో జన్ జీ ఉద్యమం రాకముందే ఫీజు బకాయిలన్నింటినీ విడుదల చేయండి**
- **రాహుల్ గాంధీ సంగతి దేవుడెరుగు మొదట మీ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిని నియమించండి**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి**



**మిర్యాలగూడ వెలుతురు జూలై 26:**

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసనకు దిగిన విద్యార్థులకు మద్దతుగా రేవంత్ రెడ్డి గారు నిలవడం శుభసూచకమే గాని ఇక్కడ ఉన్న విద్యార్థుల బాధలు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరో జన్ జీ ఉద్యమం ప్రారంభం కాకముందే విద్యార్థుల సమస్యలు తీర్చాలని అలాగే రాహుల్ గాంధీ సంగతి దేవుడెరుగు కానీ మీ మంత్రివర్గంలో జెన్ జీ విద్యాశాఖ మంత్రిని నియమించండి అని విజ్ఞప్తి చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య సంజన పోయిన జయమ్మ ఎస్పీ నాయుడు దోనేటి శేఖర్ గుండెపురి సత్యనారాయణ నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠాత్మక "ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు"తో డా. జి. హరిచరణ్‌కు ఘన సత్కారం

**బషీర్ బాగ్ వెలుతురు 26 జులై:**



అపోలో హాస్పిటల్, సికింద్రాబాద్ మరియు సీజన్స్ హాస్పిటల్స్, అంబర్‌పేట్‌లో సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ & లిపిడాలజిస్ట్గా సేవలందిస్తున్న డా. జి. హరిచరణ్ (ఎం.డి. ఇంటర్నల్ మెడిసిన్, ఫెలోషిప్ ఇన్ AI & డిజిటల్ హెల్త్, RCP&RCS, గ్లాస్గో, యూకే) గారికి వైద్య రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక "ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు" ప్రదానం చేయబడింది.ఈ అవార్డును రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ 2026 జూలై 26న హైదరాబాద్‌లోని నారాయణగూడ, కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో జరిగిన ఘన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ డాక్టర్స్ సెల్, తెలంగాణ రాష్ట్రం నిర్వహించింది. ఈ వేడుకకు ప్రముఖ వైద్యులు, ఆరోగ్య నిపుణులు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు విశిష్ట అతిథులు హాజరయ్యారు.డా. హరిచరణ్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, మధుమేహ నియంత్రణలో విశేష కృషి, నివారణ వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఉచిత వైద్య శిబిరాల ద్వారా సమాజ సేవ చేయడం, ప్రజారోగ్య పరిరక్షణకు అంకితభావంతో పనిచేయడం వంటి అంశాలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వంటి ఆధునిక సాంకేతికతలను వైద్య రంగంలో వినియోగించేందుకు ఆయన చేస్తున్న కృషి కూడా విశేష ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా డా. హరిచరణ్ గారు మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని తన రోగులకు, గురువులకు, సహచర వైద్యులకు మరియు కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు భవిష్యత్తులో మరింత నిబద్ధతతో, మానవతా దృక్పథంతో సమాజానికి సేవ చేయడానికి తనకు మరింత ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు వైద్య రంగంలో విశిష్ట సేవలు, ఉన్నత నైతిక విలువలు, సమాజ ఆరోగ్యాభివృద్ధికి చేసిన అసాధారణ కృషిని గుర్తించి ప్రదానం చేసే అత్యంత గౌరవనీయమైన పురస్కారంగా భావించబడుతుంది.

# చౌటుప్పల్‌లో ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం వీక్షణ

- **బీజేపీ మున్సిపల్ కార్యాలయంలో 136వ ఎపిసోడ్ ప్రసారం**
- **పాల్గొన్న నల్గొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి**
- **మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ హాజరు**
- **పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల పాల్గొనడం**
- **ప్రధాని సందేశాలను కార్యకర్తలు వీక్షించారు**
- **పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం**

**చౌటుప్పల్ వెలుతురు జూలై 26:**



చౌటుప్పల్ మున్సిపల్ బీజేపీ కార్యాలయంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' (మనసులో మాట) కార్యక్రమం 136వ ఎపిసోడ్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, జిల్లా నాయకుడు రమణగోని శంకరయ్య, 2వ వార్డు కౌన్సిలర్ పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య, 18వ వార్డు కౌన్సిలర్ బుద్ధ సురేష్, ముత్యాల భూపాల్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉబ్బు బుచ్చయ్య, ఆలే చిరంజీవి, కడవేరు పాండు, గుండెబోయిన వేణు, పర్నే అంజిరెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగంలోని అంశాలను కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు.

# అక్రమ ఇసుక రవాణాని అరికట్టండి

- ఇసుక ర్యాంప్‌లలో వస్తున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలి
- ఇసుక కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లను పూర్తిగా అరికట్టాలి
- మైనింగ్ విజిలెన్స్, ACB, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- ఓవర్లోడ్ లోడింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి
- TGMDC ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలి – పోలగోని భాస్కర్ గౌడ్ అధ్యక్షుడు, పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్

**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**



తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా వ్యవస్థ నిర్మాణ రంగానికి వెన్నెముక వంటిది. వేలాది లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, కార్మికులు ఈ రంగంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అదే విధంగా సాధారణ ప్రజలు తమ ఇళ్ల నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం ఇసుకపై ఆధారపడుతున్నారు. ప్రభుత్వం ఇసుక పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించేందుకు అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ, మా అసోసియేషన్ సభ్యుల నుంచి కొన్ని ఇసుక ర్యాంప్‌ల నిర్వహణపై పలు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, వాస్తవాలను వెలికితీయాలని మేము కోరుతున్నాము.మా సభ్యులు తెలియజేస్తున్న వివరాల ప్రకారం, ఇసుక ర్యాంప్‌లలో అధికారిక రుసుములకు అదనంగా ఒక్కో లారీకి ₹2,000 నుంచి ₹3,000 వరకు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. అదేవిధంగా కొన్ని ర్యాంప్‌లలో నిబంధనలకు విరుద్ధంగా ఓవర్లోడ్ లోడింగ్ జరుగుతోందని, సీరియల్ ప్రకారం వేచి ఉన్న వాహనాలను పక్కనపెట్టి డబ్బులు తీసుకుని కొంతమంది వాహనాలకు నేరుగా లోడింగ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా మా దృష్టికి వచ్చాయి.ఈ పరిస్థితుల కారణంగా లారీ యజమానులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, రవాణా వ్యవస్థలో పారదర్శకత దెబ్బతింటోందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవర్లోడ్ కారణంగా రోడ్ల భద్రతకు ప్రమాదం ఏర్పడటం, వాహనాల నిర్వహణ ఖర్చులు పెరగడం, ప్రమాదాల ముప్పు అధికమవడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

**అక్రమ ఇసుక మాఫియా పై చర్యలు తీసుకోవాలి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుంచి తెలంగాణలోకి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందనే ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు మరియు ఓవర్లోడ్ రవాణా జరుగుతోందనే ఆరోపణలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలి. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే అవకాశం ఉండటంతో పాటు, చట్టబద్ధంగా వ్యాపారం నిర్వహిస్తున్న లారీ యజమానులు కూడా నష్టపోతున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, మైనింగ్ శాఖ, మైనింగ్ విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ (ACB) మరియు రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా సంబంధిత ఇసుక ర్యాంప్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అందిన ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని మా ప్రధాన డిమాండ్. అవసరమైతే సీసీటీవీ ఫుటేజ్, లోడింగ్ రికార్డులు, సీరియల్ విధానం, చెల్లింపుల రికార్డులు, వాహనాల బరువు తనిఖీలు తదితర అంశాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి.విచారణలో చట్టవిరుద్ధ చర్యలు జరిగినట్లు తేలితే, సంబంధిత కాంట్రాక్టర్లు లేదా ఇతర బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే ఇసుక ర్యాంప్‌లలో జరిగే ప్రతి చెల్లింపుకు అధికారిక రసీదు తప్పనిసరి చేయాలి. సీరియల్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలి. ఓవర్లోడ్ లోడింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి.తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TGMDC) ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఇసుక ర్యాంప్‌ల పనితీరును పర్యవేక్షిస్తూ, ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాము. లారీ యజమానుల హక్కులను పరిరక్షించడం, ఇసుక రవాణా వ్యవస్థను పారదర్శకంగా మరియు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం కోసం ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ తరఫున డిమాండ్ చేస్తున్నాము.



పోలగోని భాస్కర్ గౌడ్అధ్యక్షుడుపెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్

# రైతు వేదికల్లో విత్తన మేళా – రైతు ముంగిట నాణ్యమైన విత్తనాలు

- డాక్టర్ బి. గోపి, ఐఏఎస్ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయ శాఖ, తెలంగాణ రాష్ట్రం

**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల జూలై 27 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల ప్రతి మండల కేంద్రంలోని రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగుకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రతి రైతు వేదికలో 4 నుంచి 5 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు.ఈ విత్తన మేళాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (PJTAU), శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం (SKLTU), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (IIMR), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్ (IIOR), కృషి విజ్ఞాన కేంద్రాల (KVKs) శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పంటల ఎంపిక, సాగు విధానాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ పద్ధతులపై శాస్త్రీయ సలహాలు, సూచనలు అందిస్తారు. ఆయా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు సిఫారసు చేసిన నాణ్యమైన విత్తనాలు కూడా ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉంటాయి.అదే విధంగా వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOలు), మండల వ్యవసాయ అధికారులు (MAOలు), సహాయ వ్యవసాయ సంచాలకులు (ADAలు), జిల్లా వ్యవసాయ అధికారులు (DAOలు), ఉద్యాన శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక, సాగు విధానాలు, నీటి యాజమాన్యంపై అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తారు.రాష్ట్రంలోని రైతులందరూ తమ సమీప రైతు వేదికలో నిర్వహించే విత్తన మేళాలో అధిక సంఖ్యలో పాల్గొని, శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తమ ప్రాంతానికి అనువైన పంటలను ఎంపిక చేసుకొని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సంచాలకులు తెలిపారు.

# ఉత్తర తెలంగాణకు గేమ్‌చేంజర్.. రూ. 2,278.14 కోట్లతో ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**

ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్‌లో ప్రతిష్ఠాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం (IAF) అవసరాల కోసం, 400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్ఓ (MRO),కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు.భూసేకరణతో పాటు ఇప్పటికే ఉన్న రహదారుల మళ్లింపు, 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ల మార్పు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా ఈ పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు.ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు విశేష ఊతం లభించడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో నిరంతర సమన్వయం ఫలితంగానే ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయంతో పాటు అన్ని అడ్డంకుల తొలగింపు ఖర్చును కూడా భరిస్తోందని చెప్పారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.ప్రాంతీయ సమతుల అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.



# రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ప్రత్యేక తనిఖీలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**

రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని గౌరవ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారులను ఆదేశించారు.గౌరవ మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ & సహకార శాఖ ముఖ్య కార్యదర్శి (APC & Secretary) రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరును సమగ్రంగా పరిశీలించేందుకు ఆరు (6) ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు.ఈ బృందాలు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుల నియంత్రణలో పనిచేస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఈ వారం యాదృచ్ఛికంగా తనిఖీ చేయనున్నాయి.ప్రత్యేక బృందాలు మార్కెట్ కమిటీల పరిపాలన, రైతులకు అందుతున్న సేవలు, మార్కెట్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించనున్నాయి.

**తనిఖీలలో ముఖ్యంగా క్రింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు:**



రైతులు తమ పంటలను విక్రయించే సమయంలో ఎదుర్కొంటున్న ఆచరణాత్మక సమస్యలు,

కనీస మద్దతు ధర (MSP) కొనుగోలు కార్యకలాపాల్లో ఉన్న లోపాలు, ఇబ్బందులు,

రైతులు తమ పంటలను నష్టపోయే ధరలకు (Distress Sale) విక్రయించాల్సిన పరిస్థితులకు దారితీస్తున్న కారణాలు.

మార్కెట్ సెస్ (Market Cess) ఎగవేతను నివారించేందుకు అవసరమైన చర్యలు

మార్కెట్ కమిటీల పరిపాలన, మౌలిక సదుపాయాలు మరియు సేవలపై సూచనలు

రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర పొందుతున్నారా? వేలం ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందా? అనే అంశాలను పరిశీలించడం.

కనీస మద్దతు ధర (MSP) కొనుగోలు కేంద్రాల నిర్వహణ, కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించడం.

మార్కెట్ కమిటీలలో అమలవుతున్న డిజిటల్ సేవలు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ మార్గదర్శకాల అమలును పరిశీలించడం.

ప్రత్యేక బృందాలు ప్రతి వారం తమ తనిఖీ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించనున్నాయి. నివేదికల్లో గుర్తించిన లోపాలు, తక్షణ చర్యలు అవసరమైన అంశాలు, విధానపరమైన సంస్కరణలు, మార్కెట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన సూచనలు పొందుపరుస్తాయి.

ఈ నివేదికలపై వచ్చే వారం గౌరవ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ & సహకార శాఖ ముఖ్య కార్యదర్శితో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు.

రైతుకు గిట్టుబాటు ధర, మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు, పారదర్శకమైన లావాదేవీలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యం అని బాధ్యతాయుత పరిపాలన ఈ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అని మంత్రి పేర్కొనారు

# సెమీకండక్టర్ మిషన్–2.0 లో తెలంగాణకు...

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోనే అగ్రగామి సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీలు) ప్రధాన నిలయంగా హైదరాబాద్ ఎదిగిందని ఆయన వెల్లడించారు. మలి దశ సెమీకండక్టర్ తయారీ పెట్టుబడులకు తెలంగాణాను సహజ ఎంపికగా గుర్తించాలని ఆయన అన్నారు.బెంగళూరులో ఒక జాతీయ ఛానల్ నిర్వహించిన "రైజింగ్ భారత్ సమ్మిట్ – సౌత్ ఎడిషన్"చర్చాగోష్టిలో రాష్ట్రం ఒక ఆకర్షణీయమైన పెట్టుబడుల కేంద్రంగా అభివృద్ధిన చెందిన తీరును వివరించారు. దక్షిణ భారత్ లో ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, సాంకేతికాభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై చర్చించేందుకు రాజకీయ నాయకులు, విధాన రూపకర్తలు, పారిశ్రామిక నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, సమృద్ధిగా లభించే నిపుణులైన మానవ వనరులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, అత్యుత్తమ వ్యాపార సౌలభ్యం కారణంగానే హైదరాబాద్ జీసీసీలకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందని శ్రీధర్‌బాబు చెప్పారు. వేగంగా విస్తరిస్తున్న జీసీసీ వ్యవస్థ, అత్యున్నత సాంకేతిక పరిశ్రమలు, అధునాతన తయారీ రంగాలకు ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యాన్నితెలంగాణ ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.ప్రపంచంలోని ప్రముఖ సెమీకండక్టర్ డిజైన్ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని, దేశంలోనే అత్యంత బలమైన చిప్ డిజైన్ ఎకోసిస్టం తెలంగాణలో ఏర్పడిందని మంత్రి వివరించారు. సెమీకండక్టర్ డిజైన్, కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ భద్రత, అధునాతన ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వేలాది మంది అత్యున్నత నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు పనిచేస్తుండటంతో ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా ఎదగడానికి అవసరమైన బలమైన పునాది రాష్ట్రంలో ఇప్పటికే ఏర్పడిందన్నారు."చిప్ డిజైన్ రంగంలో తెలంగాణ ఇప్పటికే ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమకు దిశానిర్దేశం చేస్తోంది. ఈ బలాన్ని గుర్తించి సెమీకండక్టర్ మిషన్–2.0లో తెలంగాణకు తగిన ప్రాధాన్యం ఇచ్చి చిప్ తయారీ పెట్టుబడులను ఆకర్షించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి" అని శ్రీధర్‌బాబు కోరారు.సాంకేతిక రంగంలో ఇప్పటికే తన సామర్థ్యాన్ని నిరూపించుకున్న రాష్ట్రాలకు సముచిత ప్రోత్సాహం అందిస్తే కేంద్ర ప్రభుత్వ సెమీకండక్టర్ కార్యక్రమం మరింత విజయవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణాకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా ప్రపంచ సెమీకండక్టర్ తయారీ రంగంలో భారత్ అగ్రస్థానానికి చేరాలన్న లక్ష్యం మరింత వేగంగా నెరవేరుతుందని చెప్పారు.పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కారణంగా హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జీసీసీ కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్, ఏరోస్పేస్, రక్షణ, ఔషధ పరిశ్రమలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు (బీఎఫ్ఎస్ఐ), హాస్పిటాలిటీ, బ్యూటీ టెక్నాలజీ తదితర రంగాలకు చెందిన అనేక బహుళజాతి సంస్థలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయని చెప్పారు. ఇది తెలంగాణ ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థపై అంతర్జాతీయ సంస్థలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రపంచ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులపై రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పెట్టుబడులు పెట్టడం వల్లే ఈ స్థాయి అభివృద్ధి సాధ్యమైందని శ్రీధర్‌బాబు చెప్పారు.



రాష్ట్రవ్యాప్తంగా చివరి గ్రామం వరకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీ విస్తరించడంతో చిన్న పట్టణాల్లో సైతం డిజిటల్ సదుపాయాలతో పరిశ్రమలు నెలకొల్పే అవకాశం కలిగిందన్నారు. 21 రోజుల్లో పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే సింగిల్ విండో విధానం తెలంగాణను దేశంలో వ్యాపార నిర్వహణకు అత్యంత అనుకూల రాష్ట్రాల్లో ఒకటిగా నిలబెట్టిందని చెప్పారు.రానున్న రోజుల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలను జీసీసీలు, కృత్రిమ మేధ ఆధారిత పరిశ్రమలు, అధునాతన తయారీ యూనిట్లకు కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం కొత్త ప్రోత్సాహకాలు, అత్యుత్తమ మౌలిక వసతులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య మానవ వనరులను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.సెమీకండక్టర్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, ఆవిష్కరణల రంగాల్లో తెలంగాణ ఇప్పటికే సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకొని ఇండియా సెమీకండక్టర్ మిషన్–2.0లో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి శ్రీధర్‌బాబు మరోసారి విజ్ఞప్తి చేశారు."ప్రతిభావంతమైన మానవ వనరులు, వినూత్న ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం, స్థిరమైన పారిశ్రామిక విధానాల కారణంగానే హైదరాబాద్ దేశంలో జీసీసీలకు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా ఎదిగింది. ఇప్పుడు సెమీకండక్టర్ తయారీ రంగంలోనూ తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం వచ్చింది. అది తెలంగాణ అభివృద్ధికి మాత్రమే కాదు, ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో భారత్ లక్ష్యాలను మరింత బలోపేతం చేయడానికి కూడా దోహదపడుతుంది" అని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డికి గుండెపోటు

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యేకు కార్డియాక్ అరెస్ట్
- గంటసేపు సీపీఆర్‌తో వైద్యుల ప్రాణాపాయ పోరాటం
- చికిత్సకు స్పందించినట్లు వైద్యుల వెల్లడి
- వెంటిలేటర్‌పై హైదరాబాద్‌కు తరలింపు
- ఆసుపత్రికి చేరుకున్న కేటీఆర్, హరీశ్‌రావు

**హనుమకొండ, వెలుతురు, జూలై 26,**



నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హనుమకొండలోని తన నివాసంలో ఉండగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే రోహిణి ఆసుపత్రికి తరలించారు. గంటసేపు సీపీఆర్ చేసిన అనంతరం ఆయన చికిత్సకు స్పందించారని వైద్యులు తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వెంటిలేటర్ సాయంతో హైదరాబాద్‌కు తరలించారు.సుదర్శన్‌రెడ్డికి కార్డియాక్ అరెస్ట్ వచ్చిందని, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే పల్మనరీ ఆర్టరీలో రక్తం గడ్డకట్టడంతో బ్లాక్‌లు ఏర్పడ్డాయని చికిత్స అందించిన కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతారెడ్డి వెల్లడించారు. బ్లాక్‌లు కరగడానికి ప్రత్యేక ఇంజెక్షన్ ఇచ్చిన అనంతరం యాంజియోగ్రామ్ నిర్వహించామని, ప్రస్తుతం పల్స్ సాధారణంగానే ఉందని చెప్పారు. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వివరించారు.సుదర్శన్‌రెడ్డి అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రోహిణి ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

# చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

- హింస తో ఏదీ సాధించలేము
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అన్నా హజారే స్పందన
- ప్రజాస్వామ్యంలో శాంతియుత ఆందోళనలకే ప్రాధాన్యం
- నిరాహార దీక్షలతోనే 10 చట్టాలు వచ్చాయని వెల్లడి
- ప్రజల మాట వినాలని ప్రభుత్వాలకు సూచన

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 26,**



కేంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి చర్చలు, శాంతియుత ఆందోళనలే సరైన మార్గమని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడం, నియంతృత్వ ధోరణిని అవలంబించడం వల్ల శాశ్వత పరిష్కారాలు లభించవని స్పష్టం చేశారు.తాను ఇప్పటివరకు 22 సార్లు నిరాహార దీక్షలు చేపట్టానని, అయితే ఎన్నడూ హింసను ఆశ్రయించలేదని హజారే తెలిపారు.

శాంతియుత నిరసనల ద్వారానే శాసనపరమైన మార్పులు సాధ్యమయ్యాయని, తన ఉద్యమాల ఫలితంగానే 10 చట్టాలు అమల్లోకి వచ్చాయని వెల్లడించారు.ప్రభుత్వాలు ప్రజల మాట వినాలని, ప్రజా సంక్షేమానికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రజల మేలు కోసం ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయాల్సి వచ్చినా అందులో ఎలాంటి తప్పు లేదన్నారు. ప్రజాప్రయోజనాలే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రాతిపదిక కావాలని అభిప్రాయపడ్డారు.మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను కూడా శాంతియుత పద్ధతుల్లోనే సాధించుకోవాలని హజారే సూచించారు. హింసాత్మక నిరసనల కంటే శాంతియుత ఉద్యమాలు, చర్చలే ప్రజల్లోనూ పాలనలోనూ సానుకూల మార్పులు తీసుకువస్తాయని చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా హింసను ఆశ్రయించకుండా ప్రజలు, ప్రభుత్వాలు వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# శ్రీలంక ప్రధాని హరిని అమరసూరియతో శశిథరూర్ భేటీ



- పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ
- ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా హరిని అమరసూరియ
- సంప్రదాయ కేరళ శాలువాతో సత్కారం

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 26:**

శ్రీలంక ప్రధానమంత్రి డాక్టర్ హరిని అమరసూరియతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఇరు దేశాలకు పరస్పర ఆసక్తి ఉన్న పలు అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు శశిథరూర్ తెలిపారు.ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని హిందూ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన హరిని అమరసూరియ.. ప్రస్తుతం శ్రీలంక ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని శశిథరూర్ ప్రస్తావించారు. ఆమె స్నేహపూర్వక వైఖరి, అందరితో సులభంగా కలిసిపోయే నాయకత్వ శైలిని ప్రశంసించారు.ఈ సందర్భంగా శ్రీలంక ప్రధానికి సంప్రదాయ కేరళ శాలువాను కప్పి శశిథరూర్ గౌరవించారు. భారత్–శ్రీలంక సంబంధాలు, ఇరు దేశాల మధ్య సహకారం, భవిష్యత్ అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.




- పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ
- ఢిల్లీ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా హరిని అమరసూరియ
- సంప్రదాయ కేరళ శాలువాతో సత్కారం

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 26:**

శ్రీలంక ప్రధానమంత్రి డాక్టర్ హరిని అమరసూరియతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఇరు దేశాలకు పరస్పర ఆసక్తి ఉన్న పలు అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు శశిథరూర్ తెలిపారు.ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని హిందూ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన హరిని అమరసూరియ.. ప్రస్తుతం శ్రీలంక ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని శశిథరూర్ ప్రస్తావించారు.

ఆమె స్నేహపూర్వక వైఖరి, అందరితో సులభంగా కలిసిపోయే నాయకత్వ శైలిని ప్రశంసించారు.ఈ సందర్భంగా శ్రీలంక ప్రధానికి సంప్రదాయ కేరళ శాలువాను కప్పి శశిథరూర్ గౌరవించారు. భారత్–శ్రీలంక సంబంధాలు, ఇరు దేశాల మధ్య సహకారం, భవిష్యత్ అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.


# శస్త్రచికిత్స తర్వాత కోలుకుంటున్న షర్మిల

- ఆరోగ్యంపై స్వయంగా అప్డేట్ ఇచ్చిన షర్మిల
- శ్రేయోభిలాషులకు ఎక్స్‌లో కృతజ్ఞతలు
- ప్రార్థనలు, మద్దతు అండగా నిలిచాయన్న వ్యాఖ్య
- త్వరగా కోలుకోవాలని చంద్రబాబు ఆకాంక్ష
- పవన్, లోకేశ్ శుభాకాంక్షలు
- ప్రజా జీవితంలోకి త్వరగా రావాలని ఆకాంక్ష

**అమరావతి, వెలుతురు, జూలై 26:**



ఉదర శస్త్రచికిత్స అనంతరం తాను వేగంగా కోలుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఇటీవల వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుపడుతోందని ఆమె ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో తన ఆరోగ్యంపై ఆరా తీసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అండగా నిలిచిన శ్రేయోభిలాషులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల ఆత్మీయత, ప్రార్థనలు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని షర్మిల పేర్కొన్నారు.

అందరి ప్రేమాభిమానాలు, ఆశీస్సుల వల్లే తాను మరింత వేగంగా కోలుకుంటున్నానని తెలిపారు.ఇదిలా ఉండగా, షర్మిల త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఆమెకు మంచి ఆరోగ్యం చేకూరి, మనోధైర్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఎక్స్ వేదికగా సందేశం ఇచ్చారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పూర్తి ఆరోగ్యంతో మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని కోరుతూ ఇద్దరూ ఎక్స్‌లో పోస్టులు చేశారు.

# విద్యార్థుల పోరాటాన్ని కించపరిచేలా మాట్లాడటం దుర్మార్గం: బీజేపీ నేతలపై బీఆర్ఎస్ ఎంఎల్‌సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం

- బండి సంజయ్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై ఆందోళన చేస్తున్న విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రించే యత్నం సరికాదని హితవు

**హైదరాబాద్, వెలుతురు, జూలై 26:**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డిలపై బీఆర్ఎస్ ఎంఎల్‌సీ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. న్యాయం కోసం పోరాడుతున్న విద్యార్థులను కించపరిచేలా మాట్లాడినందుకు బీజేపీ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడిన శ్రవణ్, విద్యార్థుల ఆందోళనలను కించపరిచేలా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులకు బంగ్లాదేశ్, పాకిస్తాన్ మద్దతు ఉందంటూ వారిని దేశద్రోహులుగా చిత్రించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో జరిగిన పరీక్షల అక్రమాలపై జవాబుదారీతనాన్ని కోరుతూ సాగుతున్న విద్యార్థుల ఉద్యమాన్ని నీరుగార్చేందుకే ఇటువంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనలు దేశవ్యాప్తంగా వ్యాపించిన విద్యార్థి, యువజన చైతన్యానికి నిదర్శనమని శ్రవణ్ పేర్కొన్నారు. ఈ ఉద్యమ తీవ్రత వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని, ఇది ప్రజాస్వామ్య నిరసనల శక్తిని చాటిచెప్పిందని అన్నారు.ఆందోళన చేస్తున్న విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు లేదని, ఇతర దేశాల్లో అయితే వారిని కాల్చి చంపేవారని కొండ విశ్వేశ్వర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై శ్రవణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యార్థులు నిప్పుకణికలు లాంటివారు. వారిని రెచ్చగొట్టవద్దు, వారి శక్తిని తక్కువగా అంచనా వేయవద్దు" అని హెచ్చరించారు. ఈ ఆందోళన పూర్తిగా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య యుతంగా జరుగుతోందని స్పష్టం చేశారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వేలాది కుటుంబాలు తీవ్ర మానసిక వేదన అనుభవించాయని శ్రవణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యార్థి ఉద్యమం కేంద్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలను ఎండగట్టిందని పేర్కొన్నారు.



# పరీక్షల లీకేజీలపై కాంగ్రెస్ డ్రామాలను బట్టబయలు చేద్దాం!

ఈరోజు పేపర్ లీకేజీల గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలను చూస్తుంటే 'దొంగే దొంగ అన్నట్లు' ఉంది. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను ఎంతగా భ్రష్టు పట్టించారో దేశ ప్రజలెవరూ మరచిపోలేదు. కేవలం రాజకీయ ఉనికి కోసమే కాంగ్రెస్ పార్టీ ఈరోజు విద్యార్థుల భావోద్వేగాలతో చౌకబారు రాజకీయాలు చేస్తోంది.కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల చరిత్ర అంతా పేపర్ లీకేజీల మయమే. రాజస్థాన్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వరుసగా డజనుకు పైగా పేపర్లు లీక్ అయి, లక్షలాది మంది యువత జీవితాలు రోడ్డున పడ్డప్పుడు ఈ మేధావులు ఎక్కడ దాక్కున్నారు?

ఎక్కడైనా తప్పు జరిగితే బీజేపీ ప్రభుత్వం వెనకేసుకు రాదు. తప్పును ఒప్పుకుని, విచారణ జరిపించి, బాధ్యులను జైలుకు పంపే దమ్మున్న ప్రభుత్వం నరేంద్ర మోదీ ప్రభుత్వం.

పేపర్ లీకేజీలకు పాల్పడే మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా రూ 1 కోటి వరకు జరిమానా, 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే 'యాంటీ-పేపర్ లీక్ చట్టాన్ని (Public Examinations Bill)' తీసుకొచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదే. కాంగ్రెస్ పార్టీ తన హయాంలో ఇలాంటి ఒక్క కఠినమైన చట్టమైనా తెచ్చిందా?

లీకేజీలపై అనుమానం రాగానే స్వతంత్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐకి కేసులను అప్పగించి, నిష్పక్షపాతంగా విచారణ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం జరిపిస్తుంది .

కాంగ్రెస్ లాగా తప్పులను కార్పెట్ కింద దాచే అలవాటు మాకు లేదు.

పరీక్షల పారదర్శకత కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) లో సంస్కరణలు తెస్తూ, ఉన్నత స్థాయి నిపుణుల కమిటీలను వేసి వ్యవస్థను మరింత బలోపేతం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసింది.

యువతపై కాంగ్రెస్‌కు ఉన్నది ప్రేమ కాదు, కేవలం రాజకీయం మాత్రమే. వ్యవస్థను క్లీన్ చేయడానికి బీజేపీ కఠిన నిర్ణయాలు తీసుకుంటుంటే, దానికి అడ్డుపడటం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. పేపర్ లీక్ మాఫియాను మూలాలతో సహా అణచివేసే వరకు మా ప్రభుత్వం విశ్రమించదు. కాంగ్రెస్ పార్టీ తన గతాన్ని చూసుకుని మాట్లాడితే మంచిది.

కేంద్రంలో మరియు వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదా కాంగ్రెస్ నేతృత్వంలోని కూటములు (UPA) అధికారంలో ఉన్న కాలంలో జరిగిన కొన్ని ప్రధాన జాతీయ మరియు రాష్ట్ర స్థాయి పేపర్ లీక్ సంఘటనల వివరాలు

కేంద్రంలో UPA/కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో 2004 నుండి 2014 జరిగిన ప్రధాన లీకులు

కేంద్రంలో డాక్టర్ మాన్ మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ (UPA) ప్రభుత్వం కొనసాగిన కాలంలో పలు ప్రతిష్టాత్మక జాతీయ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి:

1) CBSE PMT పేపర్ లీక్ (2004):

ప్రస్తుత NEET పరీక్షకు పూర్వ రూపమైన 'ఆల్ ఇండియా ప్రీ-మెడికల్ టెస్ట్' (CBSE PMT) ప్రశ్నపత్రం 2004లో పరీక్షకు ముందే లీకై తీవ్ర సంచలనం సృష్టించింది.

2) CBSE క్లాస్ 12 అకౌంటెన్సీ (2006):

ఢిల్లీలో సిబిఎస్ఇ 12వ తరగతి అకౌంటెన్సీ పేపర్ పరీక్షకు ముందే బయటకు వచ్చింది.

3) AIIMS ప్రి-పిజి (Pre-PG) పరీక్ష (2006):

ఎయిమ్స్ పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష పత్రాలు లీక్ అయ్యాయి.

4) AIEEE పేపర్ లీక్ (2007 & 2011):

దేశవ్యాప్త ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన 'ఆల్ ఇండియా ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్' (AIEEE) ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారు. 2011లో ఉత్తర ప్రదేశ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఈ లీకేజీ ప్రభావం చూపింది.

5) CBSE బోర్డు పరీక్షలు (2011 & 2014):

2011లో క్లాస్ 12 ఫిజిక్స్ పేపర్, అలాగే 2014లో క్లాస్ 12 ఎకనామిక్స్ మరియు క్లాస్ 10 మ్యాథ్స్ పేపర్లు లీక్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి.

రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన లీకులు:

కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా లేదా ప్రాంతీయ పార్టీలతో కలిసి కూటమిగా పాలించిన వివిధ రాష్ట్రాలలోనూ అనేక రిక్రూట్‌మెంట్, బోర్డు పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి:

1) రాజస్థాన్ అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం 2018-2023 :

రాజస్థాన్‌లో కాంగ్రెస్ పాలనలో అత్యధికంగా పేపర్ లీకులు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి.

REET స్కామ్ (2021): 'రాజస్థాన్ ఎలిజిబిలిటీ ఎగ్జామినేషన్ ఫర్ టీచర్స్' (REET) పరీక్ష పత్రం పెద్ద ఎత్తున లీక్ కావడంతో అప్పటి ప్రభుత్వం ఈ ఉపాధ్యాయ నియామక పరీక్షను రద్దు చేయాల్సి వచ్చింది.

ఇతర లీకులు: రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (RPSC) నిర్వహించిన వివిధ రిక్రూట్‌మెంట్ పరీక్షలు, ఫారెస్ట్ గార్డ్ పరీక్షల పేపర్లు కూడా లీక్ అయ్యాయి.

2) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో APPSC లీకులు:

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు గ్రూప్-1, వైద్యాధికారుల నియామక పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ మరియు అక్రమాలపై అప్పట్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి.

3) హిమాచల్ ప్రదేశ్ & జార్ఖండ్ (ఇటీవలి కాంగ్రెస్ / కూటమి పాలన) హిమాచల్ ప్రదేశ్:

ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్న కాలంలో క్లాస్ 12 ఇంగ్లీష్ బోర్డు ఎగ్జామ్ పేపర్ లీక్ అయింది.

జార్ఖండ్ (JMM-కాంగ్రెస్ కూటమి): జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (JSSC) నిర్వహించిన నియామక పరీక్షలు మరియు క్లాస్ 10 పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి.

4) తెలంగాణ (2024-2026):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటర్మీడియట్ (క్లాస్ 12) పరీక్షలు మరియు క్లాస్ 10 ఉర్దూ పేపర్ లీక్ / సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయినట్లు రాజకీయంగా ఆరోపణలు వ్యక్తమయ్యాయి.

5) మహారాష్ట్ర (కాంగ్రెస్-NCP కూటమి - 2013)

మహారాష్ట్ర HSC లీక్ (2013): కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమి అధికారంలో ఉన్నప్పుడు మహారాష్ట్ర బోర్డుకు చెందిన హెచ్‌ఎస్‌సి (12వ తరగతి) ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి.



కంచర్ల విద్యాసాగర్ రెడ్డి,
భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 26:**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాకుగా చూపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముందుగా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఒక్కరోజులో ఏర్పడినవి కావని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా పేరుకుపోయిన వారసత్వ సమస్య అని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు బకాయిలు పెడుతున్న సమయంలో రామచంద్రరావు ఎందుకు మౌనం వహించారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దేశంలో తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడ ఈ పథకాన్ని అమలు చేస్తుందో స్పష్టం చేయాలని మంత్రి సవాల్ విసిరారు. విద్యార్థుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని, కనీసం రాష్ట్రాలపై ఉన్న ఆర్థిక భారాన్ని పంచుకుంటూ కేంద్రం కూడా తన వంతు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 సంవత్సరాలకు తగ్గించాలని చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ఆ అంశంపై సమాధానం చెప్పకుండా దృష్టి మళ్లించేందుకే బీజేపీ నాయకులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు.ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించే ప్రతిపాదనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందా? లేదా? అనే విషయాన్ని రామచంద్రరావు స్పష్టంగా చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.విద్యార్థి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన అభిప్రాయంతో ఉందన్నారు. ఈ విషయంలో బీజేపీ వైఖరి ఏమిటో వెల్లడించాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలకు బీజేపీ మద్దతు ఇస్తుందా? లేదా వ్యతిరేకిస్తుందా? అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. పరీక్ష పేపర్ల లీకేజీ తో విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటున్న బిజెపి కి విద్యార్థుల గురించి ప్రశ్నించే కనీస నైతిక అర్హత లేదు.



# సౌదీ అరామ్‌కోపై హూతీల డ్రోన్ దాడి కలకలం

- ఎర్ర సముద్రంలో నౌకల దిగ్బంధనానికి హూతీల హెచ్చరిక
- రాస్ తనురా రిఫైనరీనే లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటన
- చమురు సరఫరాపై పెరుగుతున్న ఆందోళనలు
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల మధ్య మరో సంక్షోభం

**రియాద్, వెలుతురు, జూలై 26,**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఘర్షణల ప్రభావం కొనసాగుతుండగానే.. సౌదీ అరేబియా-ఇరాన్ మద్దతు ఉన్న హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులు ప్రపంచ ఆందోళనకు కారణమవుతున్నాయి. సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం వెలువడింది.యెమెన్‌పై సౌదీ అరేబియా జరిపిన వైమానిక దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడులు చేపట్టినట్లు హూతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. రాస్ తనురాలోని అరామ్‌కో రిఫైనరీను లక్ష్యంగా చేసుకున్నామని వెల్లడించారు. అలాగే యెమెన్‌పై దిగ్బంధనం ఎత్తివేసే వరకు ఎర్ర సముద్రంలో నౌకల రాకపోకలను అడ్డుకుంటామని హెచ్చరించారు.దాడి తర్వాత రిఫైనరీ ప్రాంతంలో భారీగా మంటలు చెలరేగినట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి. ఘటన నేపథ్యంలో రిఫైనరీ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. అయితే మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ దాడిలో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టంపై పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు.



**చమురు రవాణాకు కొత్త ముప్పు**

ఇప్పటికే అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ చమురు మార్కెట్లు ఒడిదుడుకులకు గురవుతున్నాయి. ప్రపంచంలోని కీలక చమురు రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధిలో ఇరాన్ చర్యలతో సరఫరాపై ఆందోళనలు నెలకొన్నాయి.ఇప్పుడు ఎర్ర సముద్రానికి ప్రవేశ ద్వారమైన బాబ్ ఎల్-మాండెబ్ జలసంధిలోనూ నౌకలను అడ్డుకుంటామని హూతీలు ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ మార్గం ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో కలుపుతుంది. ప్రపంచ వాణిజ్యంలో గణనీయమైన స్థాయిలో చమురు, ఇతర వస్తువుల రవాణా ఈ మార్గం గుండా జరుగుతుంది.చమురు సరఫరా మార్గాల్లో వరుసగా ఆటంకాలు ఏర్పడితే అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన భద్రతకు కొత్త సవాలుగా మారుతున్నాయి.

# బాంకీపూర్‌లో 'జెన్ జీ' ఎఫెక్ట్.. బీజేపీకి ప్రతిష్ఠాత్మక పోరు

- బీజేపీ కంచుకోటగా పేరున్న బాంకీపూర్‌లో ఉపఎన్నిక
- రంగంలోకి సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్
- మూడింట ఒక వంతు యువ ఓటర్లే.. వారిపైనే అందరి దృష్టి
- విద్యార్థుల ఉద్యమం తర్వాత మారిన రాజకీయ సమీకరణాలు
- సంప్రదాయ ఓటు బ్యాంకా? యువత ప్రభావమా? అన్నదే కీలకం

**పట్నా, వెలుతురు, జూలై 26,**

బిహార్ రాజధాని పట్నాలోని బాంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఇది కేవలం ఒక స్థానానికి జరిగే ఎన్నిక కాకుండా, బీజేపీకి ప్రతిష్ఠాత్మక పోరుగా, సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ రాజకీయ బలానికి పరీక్షగా, అలాగే 'జెన్ జీ' ఓటర్ల ప్రభావాన్ని కొలిచే ఎన్నికగా మారిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.బాంకీపూర్ నియోజకవర్గం చాలా కాలంగా బీజేపీకి కంచుకోటగా ఉంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రాజ్యసభకు వెళ్లిన నితిన్ నవీన్ ఈ స్థానం నుంచి పలుమార్లు విజయం సాధించారు. ఆయన రాజీనామాతో ఖాళీ అయిన ఈ స్థానంలో ఇప్పుడు ఉపఎన్నిక జరగనుంది. కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీకి ఈ సీటు నిలబెట్టుకోవడం ప్రతిష్ఠాత్మకంగా మారింది.ఈ ఎన్నికలో ప్రశాంత్ కిశోర్ స్వయంగా బరిలోకి దిగడం పోరును మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. ఇటీవల విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల అంశాలపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో యువ ఓటర్ల వైఖరి ఎలా ఉంటుందనే దానిపై రాజకీయ పార్టీలన్నీ దృష్టి సారించాయి.బాంకీపూర్ ప్రత్యేకత యువ ఓటర్లే. పట్నా యూనివర్సిటీ, ఎన్ఐటీ పట్నా, బీఎన్ కాలేజ్, సైన్స్ కాలేజ్, ఏఎన్ కాలేజ్, చాణక్య నేషనల్ లా యూనివర్సిటీతో పాటు అనేక కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. మొత్తం 3.79 లక్షల మంది ఓటర్లలో సుమారు 1.20 నుంచి 1.35 లక్షల మంది 18 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు వారే. అంటే దాదాపు మూడింట ఒక వంతు ఓటర్లు యువతే కావడం ఈ ఎన్నికలో కీలక అంశంగా మారింది.నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వివాదం తర్వాత జరిగిన విద్యార్థుల ఉద్యమాలు యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంచాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉపాధి, విద్య, పోటీ పరీక్షల అంశాలపై యువత మరింత చురుకుగా స్పందిస్తోందని, ఈ అంశాలను అన్ని పార్టీలు ప్రచారంలో ప్రస్తావించే అవకాశం ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా ప్రశాంత్ కిశోర్ ఈ అంశాలను బలంగా వినియోగించుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.మరోవైపు బీజేపీ మాత్రం అభివృద్ధి, బలమైన పార్టీ వ్యవస్థ, సంప్రదాయ ఓటు బ్యాంకుపైనే ఆధారపడుతోంది. వ్యాపార వర్గాలు, మధ్యతరగతి, ఎన్నో ఏళ్లుగా బీజేపీకి మద్దతుగా ఉన్న ఓటర్లే తమ బలమని భావిస్తోంది. బూత్ స్థాయి వరకు విస్తరించిన పార్టీ యంత్రాంగంతో ఎన్నికను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది.అయితే యువ ఓటర్లు సంప్రదాయ ఓటర్లలా ఒకే పార్టీకి కట్టుబడి ఉండరని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ వర్గం తాజా అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, అందువల్ల ఏ పార్టీకి వారు ముందుగానే ఖాయమైన ఓటు బ్యాంక్ కాదని అభిప్రాయపడుతున్నారు.ఇటీవల విద్యార్థుల ఉద్యమం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ప్రభుత్వ హామీలతో ముగిసినప్పటికీ, ఆ ఉద్యమ ప్రభావం పోలింగ్ రోజు వరకు కొనసాగుతుందా? లేక సంప్రదాయ రాజకీయ సమీకరణాలే మళ్లీ పైచేయి సాధిస్తాయా? అన్నదే ఇప్పుడు బాంకీపూర్ ఉపఎన్నికలో ప్రధాన చర్చగా మారింది.

# కమిషనరేట్‌లో సమన్వయమే విజయానికి మూలం: సీపీ సుమతి

- సకాలంలో అధికారిక పనులు పూర్తి చేయాలని సూచన
- విభాగాల మధ్య సమన్వయం పెంచాలని ఆదేశం
- క్షేత్రస్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలి
- బృంద సమన్వయంతోనే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమని వ్యాఖ్య

**హైదరాబాద్, వెలుతురు, జూలై 26,**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అంతర్గత సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఐపీఎస్) సీపీ కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అధికారిక పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచాలని ఆమె సూచించారు.క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు అవసరమైన సహకారాన్ని అందించాలని, కమిషనరేట్‌లోని ప్రతి విభాగం పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అందించగలమని సీపీ సుమతి పేర్కొన్నారు."ఒకే బృందం... ఒకే లక్ష్యం... మరింత బలమైన పోలీసింగ్" అనే లక్ష్యంతో ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆమె పిలుపునిచ్చారు.



# కళాకారులు కదిలితే... చరిత్ర కదులుతుంది

- **తెలంగాణ జానపద అకాడమీ – జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం ఒక సాంస్కృతిక ఉద్యమ పిలుపు**

"ఒక జాతి చరిత్రను తెలుసుకోవాలంటే దాని రాజుల చరిత్ర మాత్రమే కాదు, ప్రజల పాటలు, కథలు, కళలు, సంప్రదాయాలను కూడా తెలుసు కోవాలి." తెలంగాణ చరిత్రకు ఇదే అసలైన కొలమానం. రాజభవనాల కంటే పల్లెలు, శాసనాల కంటే జానపద గేయాలు, సింహాసనాల కంటే డప్పు, ఒగ్గుకథ, కిన్నెర, కోలాటం, చిందు యక్షగానం వంటి కళారూపాలే తెలంగాణ ఆత్మను సజీవంగా నిలబెట్టాయి.

తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు; అది వేల సంవత్సరాల సాంస్కృతిక నాగరికత. శాతవాహనుల కాలం నుంచి కాకతీయులు, గోల్కొండ, నిజాం పాలన, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ప్రతి చారిత్రక దశలో ప్రజల గొంతుకగా నిలిచింది జానపద కళ. అందుకే తెలంగాణ జానపద సంపద దేశంలోనే అత్యంత వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వాలలో ఒకటి.

అయితే ఒక ప్రశ్న మన ముందుంది.

తెలంగాణ ఏర్పడి ఇన్ని సంవత్సరాలు గడిచినా తెలంగాణకు ప్రత్యేక జానపద అకాడమీ ఎందుకు లేదు?

**జానపద విశ్వవిద్యాలయం ఎందుకు లేదు?**

వేలాది మంది గ్రామీణ కళాకారుల కళలు అంతరించిపోతుంటే ప్రభుత్వం ఎందుకు చూస్తూ ఊరుకుంటోంది?

ఈ ప్రశ్నలు ఒక్క కళాకారులవి కావు. ఇవి తెలంగాణ సమాజం అడగాల్సిన ప్రశ్నలు.

ఈ రోజు ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల కోసం పనిచేసే సుమారు 550 మంది కళాకారులు ఉన్నారు. వారి సేవలకు గౌరవం ఉంది. వారి సంక్షేమం కూడా అవసరమే. కానీ తెలంగాణలో గ్రామాల్లో జీవిస్తున్న వేలాది జానపద కళాకారుల పరిస్థితి ఏమిటి? ఒగ్గుకథ చెప్పే కళాకారుడు, కిన్నెర వాయించే కళాకారుడు, డప్పు కళాకారుడు, చిందు యక్షగాన కళాకారుడు, భజన బృందాలు, కోలాట బృందాలు, గుస్సాడి, లంబాడి, బుర్రకథ, పిట్టలదొర వంటి కళారూపాలను జీవంతో నిలబెట్టిన కళాకారులకు సమగ్ర విధానం ఎక్కడ ఉంది?

ప్రభుత్వ ప్రచారం కోసం కళాకారులు అవసరమే. కానీ ప్రజల చరిత్రను, ప్రజల సంస్కృతిని, ప్రజల జ్ఞాపకాలను కాపాడే గ్రామీణ జానపద కళాకారులను రక్షించడం అంతకంటే గొప్ప బాధ్యత. ఒక ప్రభుత్వం తన సాంస్కృతిక మూలాలను పరిరక్షించలేకపోతే, అది భవిష్యత్ తరాలకు ఏమి అందిస్తుంది?

ఈ విషయంలో కర్ణాటక ఒక ఆదర్శంగా నిలుస్తోంది. అక్కడ జానపద అకాడమీ కళాకారులను గుర్తించి, పరిశోధనలు నిర్వహించి, పుస్తకాలు ప్రచురించి, శిక్షణ ఇచ్చి, ఉత్సవాలు నిర్వహించి, కళలను భద్రపరుస్తోంది. జానపద అధ్యయనానికి ప్రత్యేక విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇతర రాష్ట్రాలు కూడా తమ జానపద కళలను సాంస్కృతిక సంపదగా భావించి పరిరక్షిస్తున్నాయి.

అయితే జానపద కళలకు ఉద్యమాల నేల అయిన తెలంగాణ ఎందుకు వెనుకబడాలి?

అందుకే మా డిమాండ్ స్పష్టంగా ఉంది.

తెలంగాణ జానపద అకాడమీ వెంటనే ఏర్పాటు చేయాలి.

తెలంగాణ జానపద విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి.

ఈ రెండు సంస్థలు ఏర్పడితేనే కళాకారుల నమోదు, కళల డాక్యుమెంటేషన్, పరిశోధన, శిక్షణ, ప్రచురణలు, విద్యా కోర్సులు, మ్యూజియంలు, డిజిటల్ ఆర్కైవ్‌లు, యువతకు శిక్షణ, కళాకారుల సంక్షేమ కార్యక్రమాలు ఒకే వేదికపై అభివృద్ధి చెందుతాయి.

ఈ లక్ష్యంతోనే ఆగస్టు 4న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మేధావులు, జానపద చరిత్రకారులు, పరిశోధకులు, కళాకారులు, సాంస్కృతిక సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాము. ఇది కేవలం చర్చ కాదు; తెలంగాణ సాంస్కృతిక భవిష్యత్తుకు రూపకల్పన చేసే ప్రారంభం.

ఈ సమావేశం తర్వాత ఉద్యమం దశలవారీగా కొనసాగుతుంది. జానపద కళాకారులకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తాము. రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష మంది ప్రజలు, కళాకారులు, మేధావుల సంతకాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తాము. అనంతరం కర్ణాటక జానపద అకాడమీ, జానపద విశ్వవిద్యాలయాన్ని అధ్యయనం చేసి తెలంగాణకు అనువైన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాము.

ఈ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, 20–25 వేల మంది జానపద కళాకారులతో శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మిస్తాము. రాష్ట్రవ్యాప్తంగా కళా ప్రదర్శనలు, ధర్నాలు, భారీ ర్యాలీలు, సాంస్కృతిక నిరసనలు నిర్వహిస్తాము. ఇది ఎవరికీ వ్యతిరేకంగా కాదు; తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడేందుకు.

ప్రభుత్వానికి మా ప్రశ్నలు ఇవే:

తెలంగాణ ఉద్యమంలో జానపద కళాకారుల సేవలను గుర్తించిన ప్రభుత్వం, వారి భవిష్యత్తుకు శాశ్వత సంస్థలను ఎందుకు ఏర్పాటు చేయదు?

దేశంలో అత్యధిక జానపద కళారూపాలు ఉన్న రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణకు ప్రత్యేక జానపద అకాడమీ లేకపోవడం ఎందుకు?

నేటికీ సాంస్కృతిక విధానం రూపంలో దించలేదు ఎందుకు?

గ్రామీణ కళాకారుల కళలు అంతరించిపోతే, వాటిని తిరిగి ఎవరు తీసుకువస్తారు?

ఇది ఇప్పుడే చేయకపోతే, మరో తరం తర్వాత ఈ కళల పరిస్థితి ఏమిటి?

మా డిమాండ్ రాజకీయ ప్రయోజనం కోసం కాదు. ఇది సాంస్కృతిక బాధ్యత.

మా పోరాటం పదవుల కోసం కాదు. ఇది ప్రజల చరిత్ర కోసం.

మా ఉద్యమం వ్యక్తుల కోసం కాదు. ఇది తెలంగాణ జానపద అస్తిత్వం కోసం.

చరిత్ర చెబుతోంది–ప్రజల కళలను ఎవరూ శాశ్వతంగా అణచలేరు. కళాకారుల గొంతును ఎవరూ శాశ్వతంగా మూయలేరు.


చివరిగా ఒక మాట–

కళాకారులు కదిలితే... చరిత్ర కదులుతుంది అనేది చారిత్రిక సత్యం

తెలంగాణ జానపద అకాడమీని ఏర్పాటు చేయాలి!

తెలంగాణ జానపద విశ్వవిద్యాలయాన్ని వెంటనే స్థాపించాలి! దిని కోసమే సకల కళల జేఏసీ ఏర్పాటు కుడా

ఈ డిమాండ్... కోసమే ఇదే మా సాంస్కృతిక ఉద్యమం!



**భూపతి వెంకటేశ్వర్లు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు**

# మన కీ బాత్‌లో ప్రధాని సందేశాలు



- **136వ ఎపిసోడ్‌ను వీక్షించిన బీజేపీ నేతలు**
- **కార్గిల్ అమరవీరులకు ప్రధాని నివాళి**
- **డీఆర్‌డీవో విజయాలను ప్రశంసించిన మోదీ**
- **నీటి సంరక్షణ, వ్యర్థాల వినియోగంపై పిలుపు**
- **అంతర్జాతీయ ఒలింపియాడ్ విజేతలకు అభినందనలు**
- **పోచంపల్లి వస్త్రాలకు ప్రధాని ప్రశంసలు**

**హైదరాబాద్, వెలుతురు, జూలై 26,**

ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన కీ బాత్' 136వ ఎపిసోడ్‌ను హైదరాబాద్‌లోని కాచిగూడ పోలింగ్ బూత్ నంబర్–214 బీజేపీ అధ్యక్షుడు, పార్టీ కార్యకర్తలు, స్థానికులతో కలిసి వీక్షించినట్లు బీజేపీ నాయకుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని దేశ అభివృద్ధి, విజ్ఞానశాస్త్రం, పర్యావరణ పరిరక్షణ, యువత ప్రతిభ తదితర అంశాలపై చేసిన ప్రసంగాన్ని ప్రజలతో కలిసి ఆలకించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులర్పించడంతో పాటు, విక్రమ్–1 విజయగాథను ప్రస్తావించినట్లు తెలిపారు. అలాగే పినాకా, కుశా వ్యవస్థల విజయవంతమైన పరీక్షలు నిర్వహించిన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను అభినందిస్తూ దేశ రక్షణ సామర్థ్యం మరింత బలపడుతోందని పేర్కొన్నారని వివరించారు.నీటి సంరక్షణ కోసం 'క్యాచ్ ది రైన్' కార్యక్రమం, వ్యర్థాలను సంపదగా మార్చే 'వేస్ట్ టు వెల్త్' కార్యక్రమాల ప్రాధాన్యాన్ని ప్రధాని వివరించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.అంతర్జాతీయ ఒలింపియాడ్‌లలో భారత విద్యార్థులు సాధించిన విశిష్ట విజయాలను ప్రధాని ప్రశంసించారని, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను స్మరించుకున్నారని తెలిపారు. గణేశ్ ఉత్సవాలను పర్యావరణహిత విగ్రహాలతో నిర్వహించాలని, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు వెల్లడించారు.దేశంలో చేనేత రంగం అభివృద్ధి చెందుతోందని ప్రధాని పేర్కొంటూ తెలంగాణకు చెందిన ప్రసిద్ధ పోచంపల్లి వస్త్రాలను ప్రత్యేకంగా ప్రస్తావించారని తెలిపారు. దేశ అభివృద్ధికి దోహదపడే పలు కార్యక్రమాలు, రానున్న జాతీయ కార్యక్రమాలపై కూడా ప్రధాని తన సందేశంలో వివరించినట్లు పేర్కొన్నారు.

# క్షిపణుల కొరతతో.. అమెరికా వెనక్కి?

- **ఇరాన్‌పై దాడుల ప్రణాళికలకు తాత్కాలిక బ్రేక్**
- **ఎయిర్ డిఫెన్స్ క్షిపణుల నిల్వలు తగ్గుతున్నాయనే ఆందోళన**
- **చౌక డ్రోన్లతో ఇరాన్ వ్యూహం.. ఖరీదైన క్షిపణులతో అమెరికాకు భారంగా మారిన యుద్ధం**
- **దౌత్యపరమైన పరిష్కారానికే ట్రంప్ మొగ్గు**
- **గల్ఫ్ దేశాలపై దాడులు కొనసాగితే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరిక**



**వాషింగ్టన్, వెలుతురు, జూలై 26,**

ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేసే ప్రణాళికలను అమెరికా తాత్కాలికంగా నిలిపివేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో వినియోగించే ఇంటర్‌సెప్టర్ క్షిపణుల నిల్వలు వేగంగా తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సీనియర్ భద్రతా సలహాదారులతో సమావేశం అనంతరం ఈ అంశంపై సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది.ఇరాన్ చౌక ధరలో తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తుండటం అమెరికాకు కొత్త సవాలుగా మారింది. ఒక్కో డ్రోన్ ధర 20 వేల నుంచి 50 వేల డాలర్లలోపే ఉండగా, వాటిని కూల్చేందుకు అమెరికా ప్రయోగిస్తున్న ఒక్కో ఇంటర్‌సెప్టర్ క్షిపణి ధర 1.5 మిలియన్ డాలర్లకు పైగా ఉండటం యుద్ధ వ్యయాన్ని అమాంతం పెంచుతోంది. ఈ వ్యయ అసమానత దీర్ఘకాలంలో అమెరికాపై ఆర్థిక, సైనిక ఒత్తిడిని పెంచుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ మద్దతు గల దాడులు పెరగడంతో వాటి రక్షణ కోసం పేట్రియట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, ఇతర ఇంటర్‌సెప్టర్ ఆయుధాలను పెద్ద ఎత్తున వినియోగించాల్సి వచ్చిందని సమాచారం. దీంతో ఆయుధ నిల్వలు గణనీయంగా తగ్గుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే పశ్చిమాసియాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యూఎస్ సెంట్రల్ కమాండ్‌కు అవసరమైన రక్షణ సామగ్రి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది.ఈ నేపథ్యంలో వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ మాట్లాడుతూ, యుద్ధాన్ని విస్తరించడం కంటే దౌత్యపరమైన పరిష్కారానికే అధ్యక్షుడు ట్రంప్ ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. అయితే గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగితే అమెరికా తగిన ప్రతిస్పందన ఇస్తుందని హెచ్చరించారు.మరోవైపు, ఇరాన్–అమెరికా ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం వహించాలని ఖతార్, పాకిస్థాన్‌లను ట్రంప్ కోరినట్లు అంతర్జాతీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు కొత్త మలుపు తిరిగే అవకాశాలపై చర్చకు దారితీశాయి.

# ఇది ముగింపు కాదు!

- **అసలు ప్రయాణం ఇప్పుడే మొదలైంది**
- **37 రోజుల ఉద్యమం తర్వాత సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే భావోద్వేగం**
- **విద్యా వ్యవస్థలో పూర్తి పారదర్శకత వచ్చేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం**
- **మద్దతిచ్చిన వారికే కాదు.. విమర్శించిన వారికీ కృతజ్ఞతలు**
- **జంతర్‌మంతర్ ఉద్యమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు**

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 26,**

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 37 రోజుల పాటు సాగిన ఆందోళనలు ముగిసిన నేపథ్యంలో సీజేపీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే భావోద్వేగ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ''ఇది ముగింపు కాదు. కేవలం ఆరంభమే. ముందు ఇంకా చాలా పెద్ద ప్రయాణమే ఉంది'' అంటూ ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు.విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, ప్రభుత్వం ఉద్యమం ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో నిరసనను విరమించినప్పటికీ.. దేశ విద్యా వ్యవస్థలో సంపూర్ణ పారదర్శకత, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.గత 37 రోజులు తన జీవితంలో అత్యంత కఠినమైనవని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ఇప్పుడు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నానని, ఉదయం లేచిన తర్వాత రోజు ఎలా గడుస్తుందో అన్న ఒత్తిడి కూడా తగ్గిపోయిందని చెప్పారు.జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేశం కోసం వారు చేసిన త్యాగాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఉద్యమం విజయవంతం కావడానికి ప్రజల మద్దతే ప్రధాన కారణమని పేర్కొన్నారు.తమను విమర్శించిన వారికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. వారి విమర్శలే తమను మరింత మెరుగ్గా పనిచేసేలా చేశాయని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com